PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR
నవగీతం
NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 104 | పేజీలు : 8 | బుధవారం2 సెప్టెంబర్ 2026 | వెల : 4/-




# హస్తంలో హై టెన్షన్!

- తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారిన ఢిల్లీ పరిణామాలు
- మంత్రులంతా ఢిల్లీ బాట పట్టడంతో వేడెక్కిన రాజకీయాలు...
- నేతలు ,మంత్రులు, ముఖ్యమంత్రులు ఢిల్లీ బాట పట్టడం చరిత్రలో తొలి సారి..
- మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా...?
- రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి బెర్తు ఖాయమైందా...!!



హైదరాబాద్

ఒక్కసారిగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు హస్తినా బాట పట్టడం తో ఢిల్లీలో ఇంకా ఏమైనా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయా అన్న గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఎక్కడ చూసినా చర్చనీయాంశంగా మారింది. మరికొంతమంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధిష్టానం ఉద్వాసన పలికి సీనియర్ నేతలకు అవకాశం కలగనిందని.. మరి కొంతమంది కొండ సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించలని యోచిస్తున్నారని వీరిని అందుకే ఢిల్లీకి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో కొందరు వెల్లడిస్తున్నారు. అందువల్లనే పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, బట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తోపాటు మంత్రి వర్గాన్ని సీనియర్ నేతలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఉన్న - మిగతా3లో



## భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

- రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలు
- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ వీడియో సందేశం
- రాహుల్ గాంధీకి పరోక్ష చురకలు
- విపక్షాల అసత్య ప్రచారాలకు జీడీపీ లెక్కలే సమాధానమన్న మోదీ

## బీజేపీ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం

- తెలంగాణలో బీజేపీ నాయకులు, కార్యకర్తల అరెస్టులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోంది
- నల్గొండకు బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలను గృహ నిర్బంధంలో ఉంచడం అప్రజాస్వామికం
- ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హక్కు ఉంటుంది
- ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రశ్నలు అడిగిన వారినే అరెస్టు చేస్తున్నారు

హైదరాబాద్

బీజేపీ కార్యకర్తల అరెస్ట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నిరసన తెలిపేందుకు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు హక్కు ఉంటుందని, కానీ తెలంగాణలో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, వైఫల్యాలను ప్రశ్నించినందుకు, జవాబుదారీతనం కోరినందుకు ప్రతిపక్ష నాయకులను నిర్బంధిస్తున్నారంటూ కేంద్ర మంత్రి మండిపడ్డారు. బాధితులను పరామర్శించడానికి నల్గొండకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ బీజేపీ నాయకులను గృహ - మిగతా3లో





## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

- 5 కొత్త కేటగిరీలు.. అక్టోబర్ 1 నుంచి రూ.200 ఛార్జీ!
- ఎన్‌పీఎస్ పథకాలకు కొత్త వర్గీకరణ విధానం
- ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు
- అక్టోబర్ 1 నుంచి రూ.200 చేరిక ఛార్జీ
- రూ.50 చొప్పున నాలుగు విడతల్లో వసూలు







## ‘శుద్ధీకరణ’ పేరుతో సామాజిక అవమానం




- ప్రశ్నిస్తే ఎఫ్ఐఆర్‌లతో రాజకీయ ప్రతీకారం
- ఖర్గే నిలిచిన వేదికను ‘శుద్ధి’ చేయడం దళిత ఆత్మగౌరవంపై దాడి
- అంటరానితనాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులా?.. ఇదెక్కడి న్యాయం?:
- ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పోరాటాన్ని ఆపలేరు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్

దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం కాంగ్రెస్– బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వానికి సామాజిక వివక్షకు మధ్య, ప్రజాస్వామ్య ప్రశ్నకు అధికార దమనానికి మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణ అని తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికపై అనంతరం నిర్వహించిన ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని అత్యున్నత దళిత - మిగతా3లో



## విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరణ

- కఠిన చర్యలు ఉండవు : జేపీ నడ్డా
- సీజేపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలకు సంబంధించిన కేసులపై కేంద్రం కీలక ప్రకటన
- ఢిల్లీలో నమోదైన అన్ని కేసులను వెనక్కి తీసుకుంటామని నడ్డా వెల్లడి

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్‌లు ఎత్తివేత..
- ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు రద్దు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం
- ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడి



నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
2 సెప్టెంబర్ 2026

# భారత జీడీపీ వృద్ధిపై ప్రధాని మోదీ హర్షం

ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజల సంకల్ప బలం, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందంటూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పంచుకున్నారు. ఒకవైపు ఇరాన్ యుద్ధంతో ప్రపంచమంతా సంక్షోభంలో కూరుకుపోయి, సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పటికీ భారత్ మాత్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని ఆ సందేశంలో వివరించారు. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఛాత్రోం కీ గూంజ్' క్యాంపెయిన్‌పై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కొందరి ఝూట్ కీ గూంజ్‌ను ప్రచారాన్ని ఛేదించుకుని దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని వివరించారు. వోకల్ ఫర్ లోకల్, వెడ్ ఇన్ ఇండియా మంత్రాన్ని పఠించాలని యువతకు ప్రధాని పిలుపునిచ్చారు.



"భారతదేశంలో నిరాశలో కూరుకుపోయిన కొందరు వ్యక్తులు అబద్ధాలను ప్రచారం చేస్తూ, నలువైపులా నిరాశను వ్యాప్తి చేసే పనిలో పడ్డారు. వీటన్నింటినీ అధిగమించి, ఆ మాటలన్నింటినీ పటాపంచలు చేస్తూ మన దేశం 7.8% వృద్ధిని సాధించింది. మనం ఈ వృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగించాలి. మనం ఇంకా ముందుకు సాగాలి, ఇందుకోసం ఆత్మనిర్భర్ భారత్‌గా మారడం చాలా అవసరం. స్వదేశీ మంత్రమైన 'వోకల్ ఫర్ లోకల్'ను పాటించాలి. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లడం మానుకోవాలి. పెళ్లిళ్లు విదేశాల్లో చేసుకోకూడదు. 'వెడ్ ఇన్ ఇండియా' అనే మంత్రాన్ని ఆచరించాలి. అలాగే, అవసరం లేకపోతే బంగారం కూడా కొనుగోలు చేయకూడదు. మనం స్వదేశీ విధానాలపై ఎంతగా పట్టుబడితే, స్వయం సమృద్ధిపై ఎంతగా దృష్టి పెడితే మనకు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి మన యువతకు 'వికసిత్ భారత్'ను అందిస్తామన్న పూర్తి నమ్మకం నాకుంది."

**'ముందు చూపు నిర్ణయాల వల్లే ఇది సాధ్యమైంది'**

మోదీ ప్రభుత్వం ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాలే వల్లే 7.8 శాతం జీడీపీ వృద్ధి సాధ్యమైందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్? షెకావత్ పేర్కొన్నారు.? "ప్రధాని మోదీ నాయకత్వంలో తీసుకున్న కీలకమైన నిర్ణయాలు వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రధాని తీసుకున్న నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను మార్చేశాయన్నారు. అలాగే, దేశాన్ని తయారీ రంగానికి కేంద్రంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన విధానపరమైన సంస్కరణలు, వ్యాపార నిర్వహణను సులభతరం చేసేలా కల్పించిన అనుకూల వాతావరణం, ఇవన్నీ భారత్ పెట్టుబడులకు ప్రధాన ఆకర్షణ కేంద్రంగా మార్చాయన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఒత్తిడిలో ఉన్నప్పుడు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్న తరుణంలో భారత్ కూడా ఒత్తిడికి లోనవుతుందని చాలామంది భావించారు. కానీ వాటన్నింటి మధ్య ప్రధాని మోదీ వ్యవహరించిన తీరు కీలకమన్నారు.

**భారతీయుల కృషి, ఆకాంక్షలకు ప్రతిరూపం**

2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే భారత్ సాధించిన జీడీపీ వృద్ధిని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం ప్రశంసించారు. ఈ గణాంకాలు ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్?లో పోస్టు పెట్టారు.? "2026–27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశం సాధించిన 7.8శాతం వాస్తవ జీడీపీ వృద్ధి, 10.3శాతం నామమాత్ర జీడీపీ వృద్ధి, 8.2శాతం వాస్తవ జీవీఏ వృద్ధి మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తున్నాయి. ఈ గణాంకాలు 140 కోట్ల మంది భారతీయుల కృషి, ఆకాంక్షలు, ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపం. వివేకవంతమైన పాలన, నిర్ణయాత్మక విధాన రూపకల్పనల మద్దతుతో భారత్? సాధిస్తున్న సంస్కరణలు నరేంద్ర మోదీజీ దార్శనిక నాయకత్వాన్ని స్పష్టంగా కనిపిస్తుంది. మరింత బలమైన, పటిష్ఠమైన భారత్? 'వికసిత్ భారత్' దిశగా స్థిరంగా పురోగమిస్తోంది" అని రాసుకొచ్చారు.

**ఎన్‌డీఏ కూటమి పనితీరుకు నిదర్శనం**

మరోవైపు, భారత జీడీపీ వృద్ధిపై శివసేన నాయకురాలు షైనా ఎన్?సి మాట్లాడారు. జీడీపీ వృద్ధి అనేది నరేంద్ర మోదీజీ నేతృత్వంలోని ఎన్?డీఏ కూటమి పనితీరుకు నిదర్శనమన్నారు. ఓ వైపు ప్రపంచవ్యాప్తంగా పెద్ద యుద్ధాలు జరుగుతున్నా, సరఫరా గొలుసులకు అంతరాయం కలుగుతున్నా, భారత్? అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. ఇది ఒక అసాధ్యమైన కార్యమని, 140 కోట్ల మంది భారతీయులు మన సమష్టి బలాన్ని ప్రశంసించారని చెప్పారు.

# విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లు ఉపసంహరణ

విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇటీవల దిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన అన్ని ఎఫ్?ఐఆర్?లను ఉపసంహరించుకుంటామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు విద్యార్థి నిరసనలకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లపై కీలక నిర్ణయం తీసుకున్న కొద్దిసేపటికే నడ్డా ఈ ప్రకటన చేశారు.




సీజేపీ సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసనను విరమించుకోవడాన్ని కేంద్ర మంత్రి నడ్డా స్వాగతించారు. ఈ నేపథ్యంలో బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్రం సంప్రదింపులు జరిపిందని నడ్డా వెల్లడించారు. ఆయా రాష్ట్రాల పరిధిలో సీజేపీ నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని రాష్ట్రాలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం యువత సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఈ ఏడాది నీట్ పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా, జూన్ 20న జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆందోళన చేపట్టింది. అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఈ ఉద్యమం పలు నగరాలకు విస్తరించింది. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంటు ఆందోళనలో నిరసనకారులు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణలు జరిగాయి. చివరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ఇతర డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో జులై 25న సీజేపీ ఈ ఆందోళనను విరమించింది. అయితే ఆ హామీలను కేంద్రం అమలు చేయడం లేదంటూ సెప్టెంబర్ 5న మరోసారి మార్చ్‌కు సీజేపీ పిలుపునిచ్చింది.

ఎఫ్‌ఐఆర్‌లు కొట్టివేసిన సుప్రీంకోర్టు

కాగా, ఆందోళనల్లో పాల్గొన్న వారిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై సుప్రీంకోర్టులో విచారణ జరగగా, విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లన్నింటినీ కొట్టివేస్తూ మంగళవారం ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతరం కేంద్రం కూడా కేసుల ఉపసంహరణకు హామీ ఇచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, విద్యార్థుల ఆందోళనల అనంతరం సీజేపీ నాయకత్వానికి ఇచ్చిన మూడు హామీలను ప్రభుత్వం నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై జులై 20 నుంచి 25 వరకూ దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసులో కీలక ఆదేశాలు జారీ చేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం చెల్లించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒక విధానాన్ని రూపొందించాలని స్పష్టం చేసింది. యువ నిరసనకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి పూర్తి న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న అసాధారణ అధికారాల్ని వినియోగిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అయితే కేంద్రం అభ్యర్థన మేరకు జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో పాల్గొన్న తీవ్రమైన నేరచరిత్ర కలిగిన 2,873 మందిపై మాత్రం ఎఫ్?ఐఆర్?లు నమోదు చేసేందుకు దిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ప్రాణనష్టం లేదా ఆస్తి విధ్వంసంలో వారి పాత్రపై దర్యాప్తు చేయాలని సూచించింది.

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ హామీల నేపథ్యంలో సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసన మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు సీజేపీ కో–కన్వీనర్ సౌరవ్ దాస్? సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలిపారు. సెప్టెంబర్ 5న దిల్లీలోని ఇండియా గేట్ నుంచి దిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత మార్చ్ నిర్వహించాలని గతంలో పార్టీ ప్రకటించింది. అయితే కేంద్రం ఇచ్చిన హామీ, ఎఫ్‌ఐఆర్‌ల ఉపసంహరణకు సంబంధించిన చర్యల నేపథ్యంలో ఆ మార్చ్‌ను రద్దు చేస్తున్నట్లు సీజేపీ నాయకుడు సౌరవ్ దాస్ ప్రకటించారు. విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో సీజేపీ మొదటి నుంచీ వారి తరఫున నిలిచిందని ఆయన తెలిపారు. దిల్లీ పోలీసులు ఇప్పటికే ఎఫ్‌ఐఆర్‌లను కొనసాగించేందుకు ఆసక్తి చూపడం లేదని సుప్రీంకోర్టులో దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు.

# 22 మంది ప్రాణాల్ని కాపాడిన టీ బ్రేక్

## నేపాల్ వరదల్లో కొట్టుకుపోకుండా ఆపింది ఆ 10 నిమిషాలే!

ఒక కప్పు టీ కోసం తీసుకున్న 10 నిమిషాల విరామం– 22 మంది ప్రాణాల్ని కాపాడింది. కైలాస– మానస సరోవర్ యాత్ర కోసం నేపాల్ మీదుగా టిబెట్‌కు వెళ్తున్న బెంగాల్‌లోని బర్ధమాన్‌కు చెందిన యాత్రికులు నేపాల్‌లో సంభవించిన భారీ ఫ్లాష్ ఫ్లడ్ నుంచి త్రుటిలో బయటపడ్డారు. తాము టీ కోసం ఆగకపోయి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవడానికి భయంగా ఉందని వారు చెబుతున్నారు. బర్ధమాన్‌కు చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కళ్యాణ్ తా, వ్యాపారి బిప్లవ్ హజ్రా సహా 22 మంది బృందంగా కైలాస– మానస సరోవర్ యాత్రకు బయలుదేరారు. ఆగస్ట్ 22న వారు కాఠ్‌మాండూకు చేరుకున్నారు. చైనా వీసాల కోసం ఎదురుచూస్తూ 2 రోజులు గడిచాయి. చివరికి ఆగస్ట్ 25 రాత్రి సుమారు 8.30 గంటలకు వీసాలు వచ్చాయి. వీసాలు వచ్చిన వెంటనే బయలుదేరాలని సూచించడంతో ఆగస్ట్ 26న ఉదయం 6.30 గంటలకు కాఠ్‌మాండూ నుంచి చైనా సరిహద్దు దిశగా ప్రయాణం ప్రారంభించారు.



జస్ట్ 10 నిమిషాల టీ బ్రేక్– అంతలోనే దూసుకొచ్చిన వరద సుమారు రెండున్నర గంటలు ప్రయాణించిన తర్వాత వాహనం ఒక ప్రాంతంలో ఆగింది. అందరూ కాసేపు విశ్రాంతి తీసుకొని టీ తాగారు. ఈ చిన్న విరామమే వారి జీవితాల్ని మార్చింది. టీ తాగిన తర్వాత తిరిగి వాహనంలోకి ఎక్కేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే స్థానిక పోలీసులు వారిని అక్కడి నుంచి త్వరగా వెళ్లిపోవాలని హెచ్చరించారు. అప్పటికి యాత్రికులకు వరద పరిస్థితి తీవ్రత గురించి తెలియదు. అంతలోనే కొండల వైపు నుంచి భయంకరమైన శబ్దం వినిపించింది. పైకి చూసిన వారికి తెల్లటి మేఘంలా ఏదో కొండ దిగువకు వేగంగా దూసుకొస్తున్నట్లు కనిపించింది. అయితే అది మేఘం కాదు. నీరు, మట్టి, ఇసుక, భారీ బండరాళ్లతో కూడిన ఫ్లాష్ ఫ్లడ్.

**పోలీసుల హెచ్చరికలతో పరుగులు!**

కళ్యాణ్ తా చెప్పిన వివరాల ప్రకారం– పోలీసులు చేతుల్లో కర్రలతో పరిగెత్తుతూ– 'పరిగెత్తండి.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి.' అంటూ వారిని హెచ్చరించారు. ఆ ప్రాంతం గురించి పెద్దగా అవగాహన లేకపోయినా 22 మంది బెంగాలీ యాత్రికులు స్థానికులతో కలిసి ఎత్తైన ప్రాంతం వైపు పరుగులు తీశారు. దాదాపు 200 మీటర్ల ఎత్తుతో ఉన్న ఒక కొండ ప్రాంతంపైకి భయంభయంగానే చేరుకున్నారు. తమకు స్థానికులతో పోలిస్తే అంతగా శారీరక సామర్థ్యాలు లేకపోయినా, ఆ సమయంలో ప్రాణాలు కాపాడుకోవాలనే భయమే తమను పరిగెత్తించిందని చెప్పారు. ఎత్తయిన ప్రాంతానికి చేరుకున్న తర్వాత కూడా వారి భయం తగ్గలేదు. తమ కళ్లముందే వాహనాలు, చెట్లు, ఇళ్లు, పశువులు, మనుషులు వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న దృశ్యాల్ని చూశారు. కళ్యాణ్ ఆ అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ తాము నిజంగానే బతికే ఉన్నామా అనే నమ్మకం కూడా కొంత సేపటి వరకు కలగలేదని చెప్పారు. మరణాన్ని అంత దగ్గరగా ఎప్పుడూ చూడలేదని, సమయంలో మనిషి ప్రాణం కోసం చేసే పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు. ఒక తల్లి తన బిడ్డ కోసం ఆందోళనగా వెతుకుతున్న దృశ్యం, ఒకరినొకరు పట్టుకొని ప్రాణాలు కాపాడుకునేందుకు స్థానికులు ప్రయత్నించడం వంటి ఘటనల్ని చూసినట్లు వెల్లడించారు.

ఇక ఈ ఘటన తర్వాత బిప్లవ్ హజ్రా కూడా పదేపదే ఆ పది నిమిషాల టీ బ్రేక్ గురించే ఆలోచిస్తున్నారు. వాహనంలో కూర్చున్న సమయంలో తను టాయిలెట్‌కు వెళ్లాల్సి ఉందని చెప్పానని, అప్పుడు కళ్యాణ్ దా అందరం టీ తాగుదామని సూచించారని బిప్లవ్ తెలిపారు. దీంతో సుమారు 10 నిమిషాలు అక్కడే ఆగిపోయామని చెప్పారు. తాము కాస్త ముందే బయలుదేరి ఉంటే, లేదా టీ బ్రేక్ కోసం ఆగకపోయి ఉంటే ఫ్లాష్ ఫ్లడ్ వచ్చిన సమయంలో అదే బ్రిడ్జిపై ఉండేవారమని ఆయన చెప్పారు. తాము ఆగిన ప్రదేశం నుంచి ఆ బ్రిడ్జి కేవలం 6 లేదా 7 నిమిషాల దూరంలోనే ఉందని వివరించారు. తాము ముందుకు వెళ్లి ఉంటే రెండు బ్రిడ్జిల మధ్య చిక్కుకుపోయేవారమని, వెనుక బ్రిడ్జి కూలిపోగా, ముందున్న మరో బ్రిడ్జి కూడా వరదలో కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. చివరికి పరిస్థితులు కుదుటపడ్డాక ఆ 22 మంది యాత్రికులు యాత్ర రద్దు చేసుకొని తిరుగుపయనం అయ్యారు.

**సామూహిక ఖననాలు**

నేపాల్‌లో వరదల వినాశనం సృష్టించిన విషాదం రోజురోజుకూ మరింత భయానకంగా మారుతోంది. విపత్తు సంభవించి వారం రోజులు గడుస్తున్నా బురద, శిథిలాల కింద నుంచి మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. దీంతో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలోని ప్రధాన ఆస్పత్రులు, శ్మశానాలు మృతదేహాలతో నిండిపోయాయి. కొత్తగా వెలికితీస్తున్న డెడ్‌బాడీలను భద్రపరచడానికి స్థలం లేకపోవడంతో నేపాల్ ప్రభుత్వం కాఠ్‌మాండూలో సామూహిక ఖననాలు ప్రారంభించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మృతదేహాలు కుళ్లిపోయి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

## సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**హైదారాబాద్/అమరావతి** నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడించింది. ఢిల్లీ, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను కోర్టు కొట్టివేసింది. ఢిల్లీ పరిధిలో జంతర్‌మంతర్ వద్ద జూలై 20–25 వరకు జరిగిన నిరసనలపై 13 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే, ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి కేసులు ఉండవు. కానీ, ఈ నిర్ణయం అందరికీ వర్తించదు. గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై మాత్రం ఎఫ్‌ఐఆర్‌లు కొనసాగుతాయి. అలా, 2,873 మందిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లు మాత్రం కొనసాగుతాయని కోర్టు తెలిపింది. నీట్ ఆందోళనలపై అన్ని రాష్ట్రాల్లో నమోదైన కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. పరిహారం అందించేందుకు మూడు నెలల్లో విధి విధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం తెలిపినట్లు కోర్టు వ్యాఖ్యానించింది.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో కీలక మార్పులు రానున్నాయి. పథకాలను ఎలా వర్గీకరించాలి? వాటి వివరాలను ఎలా చూపించాలి? అన్నదానిపై పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్‌ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మార్పులను ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడి ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 80–100 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ–ఏ'లో ఉంటాయి. వీటిని అత్యంత అధిక రిస్క్ ఉన్న 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60–80 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–బి'లో ఉంటాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35–60 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–సి'లో ఉంటాయి. ఇవి మధ్యస్థ రిస్క్ ఉన్న 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలు. 10–35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–డి'లో ఉంటాయి. వీటిని 'కన్జర్వేటివ్'గా పరిగణిస్తారు. 0–10 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–ఈ'లో ఉంటాయి. ఇవి రుణ ఆధారిత పథకాలుగా ఉంటాయి. ఒక పథకం ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదు. దీంతో పెట్టుబడిదారులు తమ రిస్క్ స్థాయికి తగ్గ పథకాన్ని సులభంగా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో చేరే వారికి మరో మార్పు కూడా ఉంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' (పీఓపీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే వారికి ఒక్కో పీఆర్‌ఏఎన్‌పై రూ.200 వన్‌టైమ్ ఛార్జీ వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ప్రతి త్రైమాసికానికి రూ.50 చొప్పున యూనిట్లను రద్దు చేసి వసూలు చేస్తారు. పథకాలను ఎంచుకునే ముందు పెట్టుబడిదారులకు మరింత సమాచారం అందేలా పీఎఫ్‌ఆర్‌డీఏ చర్యలు తీసుకుంది. పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలు ఒకే విధానంలో కనిపించనున్నాయి. అయితే ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు కొత్త వర్గీకరణ వర్తించదు.

## 'ఎకానమీపై మోదీ చేస్తున్న ప్రచారం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉంది'

ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. జీడీపీ వృద్ధిని ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను షేర్ చేయడంపై దుయ్యబట్టారు. మోదీ ఆర్థిక వ్యవస్థపై చేస్తున్న ప్రచారం కేవలం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉందని విమర్శించారు. సామాన్య ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరిందని, 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "దేశం జీడీపీ వృద్ధి సంబరాలు జరుపుకుంటోందని నరేంద్ర మోదీ చెబుతున్నారు. ఆ సౌకర్యం ఆయనకు ఉండొచ్చు. కానీ సామాన్యుడికి లేదు! సామాన్య ప్రజలు 3'ఖ'ల భారంతో ఉన్నారు. దానికి మోదీయే బాధ్యులు!. ఆ 3'ఖ'లు ఏంటంటే అనూహ్యమైన నిరుద్యోగం, భరించలేని ధరల పెరుగుదల, అదుపులేని అసమానత!. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారు. 2026 జులై నాటికి 15– 29 ఏళ్ల మధ్య వయసున్న ప్రతి ఆరుగురు యువ భారతీయులలో ఒకరు నిరుద్యోగిగా ఉన్నారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ వాగ్దానం భగ్నమైంది. రిటైల్ ద్రవ్యోల్బణం 19 నెలల గరిష్ఠానికి చేరింది. చక్కెర, ఉల్లి, టమాటా, పప్పుధాన్యాలు, వంట నూనె, బియ్యం, పాలు, ఇలా ప్రతి నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ ధరలు సాధారణ ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఎలాగోలా బతకడానికి పోరాడుతున్నాయి. పేదలు ఆశ వదులుకున్నారు" అలాగే సంపద అసమానతలపై కూడా మోదీ ప్రభుత్వాన్ని మల్లికార్జున ఖర్గే ఎండగట్టారు. బ్రిటిష్ పాలన కంటే దారుణమైన అసమానత దేశంలో ప్రస్తుతం ఉందన్నారు. దేశ మొత్తం సంపదలో 40శాతం ఒక శాతం మంది చేతిలోనే ఉందని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో పేదల నుంచి ధనికులకు సంపద బదిలీని మోదీ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. విచ్చలవిడి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే కేంద్ర సర్కార్ ఏకైక ఆర్థిక విధానమని ఎద్దేవా చేశారు.

**'తన సన్నిహిత మిత్రుడికి ట్రావెట్ ఏజెంట్‌గా మోదీ'**

"2014 నుంచి మోదీ ప్రభుత్వం రూ. 16 లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ రుణాలను మాఫీ చేసింది. అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే రూ. 22,006 కోట్ల అంగీకరించిన క్లెయిమ్‌లకు గానూ రుణదాతలు కేవలం రూ. 6.5 కోట్లను మాత్రమే తిరిగి పొందగలిగారు. అంటే 99.97శాతం రుణాన్ని వదులుకోవాల్సి వచ్చింది. భారత ప్రధాని మోదీ తన సన్నిహిత మిత్రుడికి వ్యక్తిగత ట్రావెల్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని దేశం చూసింది!. భారతీయులు బంగారం కొనొద్దని, విదేశాలకు వెళ్లొద్దని మోదీ పదేపదే చేసే ఉపన్యాసాలు క్షేత్రస్థాయి వాస్తవాలను తెలియజేస్తున్నాయి. వాస్తవం ఏమిటంటే ప్రజలకు అబద్ధాలు చెప్పే మీ సామర్థ్యం తప్ప మరేమీ మారలేదు!" అని ఖర్గే పేర్కొన్నారు.

**ఆ జీడీపీ వృద్ధి గణాంకాల గారడీయే : జైరాం రమేశ్**

మరోవైపు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీడీపీ గణాంకాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వృద్ధిని 'గణాంకాల గారడీ'గా అభివర్ణించారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం చాలా తక్కువ ఫలితాలను సాధించిందని, కానీ మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ఫేక్ ఇన్ ఇండియా' పథకం మాత్రం నిరాటంకంగా కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం దేశ దయనీయమైన ఆర్థిక వాస్తవికతను దాచిపెడుతూ జీడీపీ గణాంకాలను తారుమారు చేస్తోందని ఆరోపించారు. ఈ మేరకు జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "నామమాత్రపు, వాస్తవ జీడీపీల మధ్య వ్యత్యాసం ద్రవ్యోల్బణాన్ని సూచిస్తుంది. అయితే ఆ తేడాను కేవలం 2.3శాతం మాత్రంగా ప్రభుత్వం చూపించింది. కానీ ఈ త్రైమాసికంలో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం 9 శాతానికి పైగా ఉంది. ఇది స్పష్టమైన వ్యత్యాసం. ఈ ఏడాది జీడీపీని లెక్కించే పద్ధతిని రెండుసార్లు సవరించిన మోదీ ప్రభుత్వమే ఈ వ్యత్యాసాన్ని సృష్టించింది. మోదీ ప్రభుత్వం నిజాయితీతో కూడిన గణాంకాలను ఇచ్చి ఉంటే వాస్తవ వృద్ధి రేటు చాలా తక్కువగా ఉండేది. ఈ విషయాన్ని మోదీ ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారుతో సహా చాలా మంది గతంలోనే చెప్పారు"

**'ప్రజలకు మోదీ ప్రభుత్వం వారానికో షాక్ ఇస్తోంది'**

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి మోదీ ప్రభుత్వం భారీ షాక్ ఇస్తోందని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. అహంకారపూరిత మోదీ ప్రభుత్వం గణాంకాల గారడీ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే పనిలో నిమగ్నమై ఉందని విమర్శించారు. "మోదీ సర్కార్ ప్రతి వారం దేశానికి పెరుగుతున్న ధరల రూపంలో ఒక కొత్త, భారీ షాక్‌ను ఇస్తోంది. ద్రవ్యోల్బణం కేవలం వంటగదికే పరిమితం కాలేదు. ఇంటి నిర్మాణం నుంచి విద్యుత్ పరికరాల వరకు ప్రతి అంశంలోనూ పెరుగుతున్న ఖర్చుల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు" అని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

# బీజేపీ నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం

-మొదటిపేజీ తరువాయి

నిర్బంధంలో ఉంచడం అత్యంత శోచనీయమని అన్నారు. కేవలం బాధితులను పరామర్శించడానికి వెళ్లినందుకే బీజేపీ నాయకులను గృహ నిర్బంధంలో ఉంచాలా? వారిని ప్రజలను కలవకుండా అడ్డుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రశ్నలు అడిగిన వారినే అరెస్టు చేస్తున్నారు, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, ప్రతిపక్షాల గొంతును అణచివేయడానికి పోలీసులను వాడుకుంటున్నారని మండిపడ్డారు. నల్గొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాసంపై దాడి జరిగినప్పుడు, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నప్పుడు, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని కిషన్ రెడ్డి అన్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన బీజేపీ నాయకులను అరెస్టు చేస్తూ, దాడులు చేసిన వారిని స్వేచ్ఛగా వదిలేయడం ఏం న్యాయమని విమర్శించారు.



తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. దాడులు ఎవరు చేశారో, బాధితులు ఎవరో, అధికారాన్ని ఎవరు దుర్వినియోగం చేస్తున్నారో వారికి బాగా తెలుసని, తెలంగాణ తన చరిత్రలో ఎన్నో ప్రజా ఉద్యమాలకు సాక్ష్యంగా నిలిచిందని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం నిలబడిన ఈ గడ్డపై అక్రమ అరెస్టుల ద్వారా ప్రశ్నించే గొంతులను అణచివేయలేరని తెలిపారు. బీజేపీ నాయకులను ఎన్నిసార్లు అరెస్టు చేసినా, నిర్బంధంలో ఉంచినా, ప్రజల కోసం మా పోరాటం ఆగదని, ప్రజలకు సంబంధించిన సమస్యలను లేవనెత్తడం, అన్యాయాన్ని బహిర్గతం చేయడం, బాధితులకు అండగా నిలబడటం తమ బాధ్యత అని అన్నారు. పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాల గొంతు నొక్కేయగలమని ప్రభుత్వం భావిస్తే, అది తీవ్రంగా పొరబడుతున్నట్లే. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయాధికారులు ప్రజలే. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల హక్కులను కాపాడటానికి, బాధితులకు అండగా నిలబడటానికి బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, ఎంతటి నిర్బంధం లేదా అణచివేత కూడా ప్రజల కోసం మా పోరాటాన్ని ఆపలేవు అంటూ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## గత ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే

# ఇప్పుడు తొలగించినవే ఎక్కువ!

రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా రూపొందించిన ఓటర్ల తొలగింపు జాబితాలోని గణాంకాలను నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో ప్రధానంగా మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో తొలగింపునకు గుర్తించిన (అనర్హులుగా భావించిన) వ్యక్తుల సంఖ్య 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వాస్తవంగా నమోదైన ఓట్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. గ్రేటర్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో చివరి అసెంబ్లీ ఎన్నికల సమయంలో 21,72,111 ఓట్లు పోల్ కాగా, ముసాయిదా తొలగింపు జాబితాలో 19,41,444 మంది వ్యక్తుల పేర్లను చేర్చారు.

**మలక్‌పేటలో ఇదీ పరిస్థితి**

2026 జూన్ నాటికి మలక్ పేటలో మొత్తం 3,30,191 మంది ఓటర్లు ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,31,354 ఓట్లు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 1,35,807 ఓట్లు నమోదైనప్పటికీ ఎన్నికల సంఘం ఇప్పుడు ఈ నియోజకవర్గానికి సంబంధించి ఏకంగా 1,47,799 పేర్లను తొలగింపు జాబితాలో చేర్చింది. అంటే సుమారు 44.76 శాతం మంది ఓటర్ల పేర్లు ఈ కేటగిరీలోకి చేరాయి.

యాకుత్?పురాలో గమనిస్తే : 3,74,948 మంది నమోదిత ఓటర్లు ఉన్న యాకుత్‌పురా నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,39,990 ఓట్లు, పార్లమెంట్ శాసన నియోజకవర్గ ఎన్నికల్లో 1,56,341 ఓట్లు పోలైనప్పటికీ 1,54,982 మంది ఓటర్ల పేర్లను తొలగింపు జాబితాలో చేర్చారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ప్రతి పది మంది ఓటర్లలో నలుగురి కంటే ఎక్కువ మంది పేర్లు తొలగింపు జాబితాలో ఉండటం గమనార్హం.

ఓటింగ్ శాతంపై ప్రభావం చూపొచ్చు : గత ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్య కంటే అధికంగా ఆయా నియోజకవర్గాల్లో



అందుబాటులో లేనివారు, వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు, మరణించిన లేదా ఆచూకీ లేని ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లయితే, ఇది గత ఎన్నికల్లో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోల్చితే ఓటింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సాధారణంగా తక్కువ ఓటింగ్ శాతం నమోదయ్యే హైదరాబాద్ నియోజకవర్గాల్లోనే సర్? ద్వారా ఇలా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగింపులు కనిపిస్తున్నాయి. 2023లో తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాల జాబితాలో మలక్‌పేట్, యాకుత్‌పురా కూడా ఉన్నాయి.

**పేర్లు తొలగిపోయినట్లు తేల్చడం సరికాదు**

తొలగింపు ముసాయిదా జాబితాను సిద్ధం చేసేందుకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) గైర్హాజరైన, నివాసం మార్చుకున్న లేదా మరణించిన ఓటర్లకు సంబంధించిన వాదనలు, అభ్యంతరాలను సేకరించడానికి ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేస్తున్నారు. అదే సమయంలో అధికారిక నోటీసులను కూడా జారీ చేస్తున్నారు. తొలగింపు ముసాయిదా జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరినీ తుది ఓటర్ల జాబితా నుంచి శాశ్వతంగా తొలగిపోయినట్లు ఇప్పుడే తేల్చడం తొందరపాటు అవుతుందని రాజకీయ నాయకులు వాదిస్తున్నారు. అయితే మలక్‌పేట్, యాకుత్‌పురాలో గత రెండు ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే తొలగింపు జాబితాలోని పేర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్రంగా పరిశీలించాల్సిన విషయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెబుతున్నారు.

# వైసీపీ తెలంగాణ నేతగా కోమటిరెడ్డి?

వైసీపీ పార్టీ ఎన్ఆర్ఐ టీమ్ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యక్ష ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కదారి పడుతున్నాయని, ఈ తరుణంలో మార్పు దిశగా బలమైన అడుగులు వేయాల్సిన అవసరం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రజలకు మేలు చేసే ఒక బలమైన రాజకీయ వేదికను పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నానని, అందుకే గత కొన్ని నెలలుగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిర్భయంగా ఖండిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమ పంథానే తనకు ఆదర్శమని ఈ వేదికగా రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో సంక్షేమ వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, విద్యా రంగానికి ఎంతో కీలకమైన ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించలేని దయనీయమైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాజకీయాన్ని కేవలం వ్యాపారంగా మార్చుకుని, పైసలు సంపాదించడమే ధ్యేయంగా వచ్చిన వాళ్లు రాజకీయాల్లో శాశ్వతంగా నిలబడలేరని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన అవినీతి, నేడు గ్రామీణ స్థాయి వరకు పాకిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు బంధు లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఒక చేతితో రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు నటిస్తూనే, మరో చేతితో గల్లీ గల్లీలో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు పెంచి ఆ డబ్బును ప్రజల నుంచి దారుణంగా గుంజుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలు ప్రజలకు సంక్షేమం అందించడానికి బదులు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయని మండిపడ్డారు. గత వైఎస్సార్ స్వర్ణయుగాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా త్వరలోనే ఒక సంచలనాత్మక నిర్ణయంతో కూడిన ప్రజా రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాల సాధన కోసం తెలంగాణ గడ్డపై వైఎస్ఆర్‌సీపీని తిరిగి బలోపేతం చేసి, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో కచ్చితంగా విప్లవాత్మకమైన మార్పు తీసుకువస్తానని చెప్పారు. అంటే వైఎస్ఆర్‌సీపీని ఆయన తెలంగాణలో ప్రారంభించి దానికి నాయకత్వం వహించే



దిశగా ఆలోచిస్తున్నారని అనుకోవచ్చు. రాజగోపాల్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. ఆయన నిత్యం ఒక సొంత ఇమేజ్, అగ్రెసివ్ మార్క్ రాజకీయం కోరుకునే నాయకుడు. గతంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి, మళ్లీ అక్కడ నుంచి కాంగ్రెస్‌లోకి రావడం వెనుక ఆయన ఆశించిన రాజకీయ ప్రాధాన్యతే ముఖ్యం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ నిరంతరం ఆలస్యం కావడం, తనకు మంత్రి పదవి దక్కకపోవడం పట్ల ఆయన వర్గం తీవ్ర తీవ్ర అసంతృప్తితో ఉంది.

ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి నాయకత్వానికి పోటీగా లేదా తన ఉనికిని చాటుకునేందుకు వైఎస్సార్ భావజాలాన్ని ప్లాట్‌ఫారమ్‌గా ఎంచుకోవడం ఆయన వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. వైఎస్సార్ పేరు తెలంగాణలో ఇప్పటికీ కొంతమంది ఓటర్లలో సానుభూతిని నింపగలదని ఆయన భావిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికీ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో వైఎస్సార్‌పై ఉన్న అభిమానం అంతరించిపోలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నేతలను, పాత వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను ఒక తాటిపైకి తెచ్చి సొంత సైన్యాన్ని నిర్మించుకోవడానికి రాజగోపాల్ రెడ్డికి ఇది ఉపయోగపడవచ్చు. ఏ నిర్ణయమైనా ధైర్యంగా తీసుకునే ఫైటింగ్ నెచర్ రాజగోపాల్ రెడ్డి సొంతం. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడని ఆయన నైజం.. తెలంగాణలో ఒక ప్రాంతీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి కావాల్సిన ఆర్థిక, రాజకీయ సత్తాను ఇస్తుంది. ఏపీకి చెందిన వైఎస్సార్‌సీపీ జెండాతో తెలంగాణలో రాజకీయం చేయడం ఎంత ప్రమాదకరమో షర్మిల అనుభవాలు నిరూపించాయి. ఏపీ కేంద్రీకృత పార్టీగా ముద్రపడిన వైఎస్సార్‌సీపీని తెలంగాణలో రీ-ఓపెన్ చేస్తే, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఆయనపై ఆంధ్రా పార్టీ అనే బలమైన తెలంగాణ సెంటిమెంట్ దాడిని విసిరే అవకాశం ఉంది. ప్రస్తుతానికి రాజగోపాల్ రెడ్డి వేస్తున్న అడుగులు కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగమని కొందరు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ కేబినెట్ పదవి ఇవ్వకపోతే, ఆయన కాంగ్రెస్‌ను వీడి సొంత దారి చూసుకోవడం ఖాయం. కానీ నేరుగా వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకుంటారా లేక వైఎస్సార్ పేరుతో కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ మద్దతు తీసుకుంటారా అనేది వేచి చూడాలి. తెలంగాణ రాజకీయాల్లో వాక్యూమ్ ఉందనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ని తెలంగాణలో పునరుద్ధరించడం అత్యంత సాహసోపేతమైన అడుగు. ఈ రిస్క్ చేసి ఆయన తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తారా లేదా మంత్రివర్గ విస్తరణ వరకు వేచి చూస్తారా అన్నదే రాబోయే రోజుల్లో తేలనుంది.

## హస్తంలో హై టెన్షన్!

-మొదటిపేజీ తరువాయి

చిక్కుముడులను, గందరగోళాన్ని, వారిలో ఉన్న మనస్పర్ధలను తొలగించేందుకే అధిష్టానం ఆదేశాలు జారీ చేశారని ఓ సీనియర్ కాంగ్రెస్ నేత వెల్లడించారు, ఎంతోకాలంగా మంత్రివర్గ విస్తరణ చేయాలని జాతీయ స్థాయి నాయకత్వం యోచిస్తుంది ఈ తరుణంలో కూడా కాంగ్రెస్ నేతలని పిలిచి ఉండవచ్చని మరో నాయకుడు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అందువల్లనే

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకేరోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఢిల్లీ బాట పట్టడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. కేంద్రమంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీల నేపథ్యంలో పాలనాపరమైన అంశాలతో పాటు పార్టీ వ్యవహారాలపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది.

**ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్.. ఒకేరోజు హస్తినబాట పట్టిన కీలక నేతలు**

తెలంగాణ కాంగ్రెస్ , కేరాఫ్ ఢిల్లీ. హస్తం పార్టీ కీలక నేతలంతా హస్తిన బాట పట్టడంతో.. అసలు ఏం జరుగుతోందన్న చర్చ జోరందుకుంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పలువురు కేంద్రమంత్రులతోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలతో కూడా రేవంత్ రెడ్డి భేటీ అయ్యే అవకాశం ఉండడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇక ఇదే సమయంలో మంత్రి కొండా సురేఖ కూడా ఢిల్లీ చేరుకున్నారు. సురేఖ వెళ్లిన ఫ్లైట్‌లోనే మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి కూడా ఢిల్లీ వెళ్లడం ఆసక్తి రేపుతోంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ కానున్నారు కొండా సురేఖ. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కూడా కోరారు సురేఖ. ముఖ్యమంత్రితోపాటు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఇప్పటికే ఢిల్లీలో ఉండగా మంత్రులు తుమ్మల, సీతక్క కూడా వరుసగా ఢిల్లీ చేరుకుంటున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా బుధవారం ఢిల్లీ చేరుకుంటారు. కొందరు మంత్రులు పాలనాపరమైన అంశాలపై ఢిల్లీ బాటపట్టగా, మరికొందరు పార్టీ పనులపై హస్తిన చేరుకుంటున్నారు.

కీలక నేతల హస్తిన టూర్‌తో కేబినెట్ విస్తరణపై కూడా టాక్స్ వినిపిస్తున్నాయి. మంత్రిపదవిపై ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లడం, కేసీ వేణుగోపాల్‌ను కలిసే అవకాశం ఉండటం ఆసక్తి రేపుతోంది. ఇక స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ తాజా రాజకీయ పరిస్థితులపై ఖర్గేతో చర్చించిన గడ్డం ప్రసాద్.. కేబినెట్‌లో చోటు కల్పించాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది..

## థౌజండ్‌వాలా

-మొదటిపేజీ తరువాయి

కానీ, ఈసారి థౌజండ్‌వాలా సెలబ్రేషన్స్‌ని కొత్తగా ప్లాన్ చేసినట్టున్నారు. ప్లాన్‌బీని అమల్లో పెట్టినట్టునట్టుంది రేవంత్ సర్కార్. ఏమిటా ప్లాన్‌బీ? ఎవరిని టార్గెట్ చెయ్యడానికి? ప్రోగ్రామ్ థీమ్ ఏంటంటే... అంబర్‌పేట్‌లో మూసీనదిపై 52 కోట్లతో కట్టిన బ్రిడ్జిని ప్రారంభించడం. తర్వాత స్పోర్ట్స్ గ్రౌండ్‌లో పబ్లిక్ మీటింగ్.. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్. కానీ, ఆ స్పీచ్‌కాపీలోనే ఒక చిన్న ఛేంజ్. చిన్నది కాదు పెద్దదే. మెయిన్ అపోజిషన్ పార్టీ ఊహించిందో లేదో గాని, రేవంత్‌రెడ్డి నుంచి బిగ్ అండ్ బిగ్గర్ ఛాలెంజ్. నీ పదేళ్ల విధ్వంసం.. నా వెయ్యి రోజుల సుపరిపాలన.. ఎవరెంత తోపో తేల్చుకుందామా అని. 2023 డిసెంబర్ 7న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సోనియా, రాహుల్, ప్రియాంక సమక్షంలో సీఎంగా రేవంత్‌రెడ్డి...

## ‘శుద్ధీకరణ’ పేరుతో సామాజిక అవమానం...




-మొదటిపేజీ తరువాయి

నాయకుల్లో ఒకరైన ఖర్గే ప్రసంగించిన వేదికను ఆ తర్వాత ‘శుద్ధి’ చేయాల్సిన ప్రదేశంగా చిత్రీకరించడం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదని, తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొన్న కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. “మనిషిని మనిషిగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని,కానీ మనిషి నిలిచిన నేలను కూడా ‘శుద్ధి’ చేయాలనే మనస్తత్వం ఇంకా కొనసాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఇటువంటి సామాజిక వివక్షకు భారతదేశం సాక్షిగా నిలవాల్సి రావడం అత్యంత దురదృష్టకరం” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆగస్టు 8న హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో జరిగిన ‘విజయ్ శంఖనాద్’ బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ప్రసంగించారని ఉత్తమ్ గుర్తుచేశారు. ఖర్గే ఏ మతాన్నీ, ఏ వర్గాన్నీ ప్రస్తావించలేదని, ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడలేదని తెలిపారు. అయితే సభ జరిగిన రెండు రోజుల తర్వాత అదే వేదికపై శ్రీరామ్ సేన ధర్మార్థ సేవా న్యాస్‌కు చెందిన సభ్యులు ‘శుద్ధీకరణ’ హవనం నిర్వహించారని పేర్కొన్నారు. అవమానించినవారిని వదిలేసి... ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఘటన కంటే దానిపై అధికార వ్యవస్థ స్పందించిన తీరు మరింతగ్భ్రాంతికరమని ఉత్తమ్ మండిపడ్డారు. ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే అవమానకరమైన ‘శుద్ధీకరణ’ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా, అదే సంస్థకు చెందిన సభ్యుడి ఫిర్యాదు ఆధారంగా ఆగస్టు 30న ఉత్తరాఖండ్ పోలీసులు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. “అవమానకరమైన చర్యను చేసినవారు ప్రశ్నలకు అతీతులా? ఆ చర్యను ప్రశ్నించిన వ్యక్తే నిందితుడా? ఇదే న్యాయమైతే న్యాయం అనే పదానికే కొత్త నిర్వచనం రాయాల్సి వస్తుందని ఆయన ఘాటుగా స్పందించారు. తప్పును ప్రశ్నించిన గొంతుపై కేసు పెట్టి, తప్పుకు కారణమైన చర్యను పక్కనపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తినే తలకిందులు చేసే రాజకీయ ధోరణి” అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి, ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలకు రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్ మరో ఉదాహరణగా నిలుస్తోందని అన్నారు. ఎఫ్ఐఆర్‌లతో సత్యాన్ని సంకెళ్లలో బంధించలేరు“ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరిగితే సత్యం మారదు. కేసులు పెరిగితే ప్రశ్నలు చనిపోవు. అధికార బలం పెరిగితే రాజ్యాంగం చిన్నదైపోదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదు. సామాజిక వివక్షను ఎదిరించడం అంతకంటే నేరం కాదు” అని ఉత్తమ్ స్పష్టం చేశారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలతో పాటు సమాజంలోని ప్రతి అణగారిన వర్గానికి కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా కులవివక్ష, ద్వేషం, బెదిరింపు రాజకీయాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# సోనియా బుక్ వివాదం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు.. ఒకప్పటి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ తన ఆత్మకథను బిలాంగింగ్ ఏ జర్నీ ఆఫ్ లవ్ పేరుతో రచించిన విషయం తెలిసిందే. ఈ పుస్తకంలో తన జీవితం.. రాహుల్ గాంధీని వివాహం చేసుకోవడం.. ఇండియాకు రావడం.. కాంగ్రెస్ పార్టీలో తనకు ఎదురైన పరిణామాలు.. ఇతర అనుభవాలను సోనియాగాంధీ పుస్తకం రూపంలో తీసుకొచ్చారు.ఈ పుస్తకానికి సంబంధించి ఇప్పుడు వివాదం నెలకొంది. సోనియాగాంధీ రాసిన బిలాంగింగ్ జర్నీ ఆఫ్ లవ్ లో వివాహస్పదమైన అంశాలు ఉన్నాయని.. బిజెపి నేతలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకం ఇప్పుడు కాంగ్రెస్, బిజెపీ మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. ఈ పుస్తకానికి భారత్‌లో తాము ప్రచురణకర్తలం కాదని ప్రముఖ పబ్లిషింగ్ హౌస్ పెంగ్విన్ రాండమ్ ఆఫ్ హౌస్ ఇండియా క్లారిటీ ఇచ్చేసింది. ఈ పుస్తకాన్ని నవంబర్ 10న విడుదల చేస్తున్నట్లు అమెరికాకు చెందిన పెంగ్విన్ రాండమ్ హౌస్ అనుబంధ విభాగంఠ్నోఫ్ ఏ నాఫ్ ప్రకటించింది. ఇలా ప్రకటించిన కొద్దిరోజుల తర్వాత దీనికి రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.సోనియా ఆత్మకథ ప్రచరణ విషయంలో పిఆర్‌హెచ్‌ఐ వెనక్కి తగ్గిందన్న ఊహాగానాలు బయల్దేరాయి. అయితే, పుస్తకంలో ఎడిటోరియల్ మార్పులకు రచయిత్రి ఒప్పుకోకపోవటం వల్లే సోనియా ఆత్మకథను ప్రచురించకూడదని తాము నిర్ణయించుకున్నట్లు వచ్చిన వార్తలు ఏమాత్రం నిజం కాదని ఆ సంస్థ తెలిపింది. పుస్తక ప్రచురణకు తాము ఆసక్తిగానే ఉన్నామంటూనే రచయితలు ఇచ్చే సమాచార వాస్తవ నిర్ధారణ, పుస్తకానికి ఉపయోగపడే సిఫారసులు చేయడం అన్నది ప్రచురణకర్తగా తమ బాధ్యత విధి అని తెలుపుకొచ్చింది.ఈ నేపథ్యంలోనే బిలాంగింగ్ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకాన్ని ఇండియాలో ప్రచురిస్తున్న పెంగ్విన్ రాండమ్ హౌస్ ఆఫ్ ఇండియా.. ఆ ప్రక్రియను నిలిపివేసినట్టు తెలుస్తోంది. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. బిజెపి నేతల ఒత్తిడి వల్లే పెంగ్విన్ కంపెనీ ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోనియాగాంధీ ఆత్మకథ అంటే బిజెపి నేతలు ఎందుకు బయపడుతున్నారని.. సోనియా గాంధీ తన జీవితంలో జరిగిన సంఘటనలను దేశ ప్రజల ముందు ఉంచడానికి ఒక పుస్తకం రూపంలో తీసుకొని వస్తుంటే.. బిజెపి నేతలు తట్టుకోలేకపోతున్నారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.ఈ వివాదం కొద్దిరోజులుగా దేశ రాజకీయాలలో కలకలం సృష్టిస్తోంది. ఈ పుస్తకంలో సోనియాగాంధీ తన జీవితానికి సంబంధించిన అనేక విషయాలను ప్రస్తావించినట్టు తెలుస్తోంది. ఇటలీలో ఆమె జననం.. ఆ తర్వాత రాహుల్ గాంధీతో ఏర్పడిన పరిచయం.. అది ప్రేమగా మారడం.. ఆయనను వివాహం చేసుకోవడం.. ఇండియాకు రావడం.. రాహుల్ గాంధీ మరణం తర్వాత ఆమె జీవితంలో చోటుచేసుకున్న మార్పులు.. రాజకీయ ప్రయాణం.. ప్రధానమంత్రి పదవి దక్కకుండా పోవడం.. నాడు సుష్మా స్వరాజ్ చేపట్టిన ఆందోళనలు.. సోనియాగాంధీ ప్రధానమంత్రి పదవిని వదులుకున్న తీరు.. కేవలం యూపీఏ చైర్ పర్సన్ గా మాత్రమే మిగిలిన తీరు.. బిజెపి ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులు.. కేంద్ర దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసులు.. వీటన్నింటిని సోనియాగాంధీ తన ఆత్మ కథ లో ప్రస్తావించినట్టు తెలుస్తోంది. ప్రధానంగా సోనియాగాంధీకి ప్రధానమంత్రి పదవి దూరంగా వెనక బిజెపి కుట్ర ఉందని ఆ పుస్తకంలో రాసినట్టు విశ్లేషకులు అంటున్నారు.ఈ అంశాలు తమకు వ్యతిరేకంగా ఉంటాయని బిజెపి నేతలు భావిస్తున్నట్టు నేషనల్ మీడియాలో వార్తలు ప్రసారం అవుతున్నాయి. అందుపల్లే బీజేపీ నేతలు పెంగ్విన్ కంపెనీ మీద ఒత్తిడి తీసుకురావడంతో మనదేశంలో ప్రచురణ నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక గహ్లోట్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు.."సోనియాగాంధీ రాసిన ఆత్మకథలు మార్పులు కావాలని పెంగ్విన్ కంపెనీ కోరడమేంటి.. అందువల్లే ప్రచురణ నిలిపివేసిందా.. దీని వెనక బిజెపి నాయకులకు ఉన్నారు. వారు రాజకీయంగా ఒత్తిడి తీసుకొస్తున్నారు.. ఆత్మకథని కూడా తట్టుకోలేని స్థితిలో బిజెపి నాయకులు ఉన్నారని" అశోక్ వ్యాక్యానించారు. మరోవైపు సోనియాగాంధీ ఆత్మ కథను నిలిపివేయడం బిజెపి చవకబారు రాజకీయాలకు అదృష్టమని ఆరోపించారు. మరోవైపు ఈ వివాదంపై పెంగ్విన్ కంపెనీ స్పందించింది. ఒక పుస్తకాన్ని ప్రచురించే క్రమంలో అన్ని అంశాలను పరిశీలిస్తామని.. ఇందులో వివాదాలకు ఆస్కారం లేదని క్లారిటీ ఇచ్చింది.సోనియా ఆత్మకథ పుస్తకం ప్రచరణ విషయంలో మోడీ ప్రభుత్వం ఒత్తిడికి పెంగ్విన్ రాండమ్ హౌస్ ఆఫ్ ఇండియా లొంగిపోయిందని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇది భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హత్య చేయడమే అంటూ ఎన్డీఏ పై విమర్శలతో మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ హయాంలో భారత భూభాగాలను చైనా ఆక్రమించడం, ఆర్‌ఎస్‌ఎస్ సహా పలు అంశాలపై మార్పులు చేయడానికి సోనియా గాంధీ అంగీకరించకపోవడంతోనే పుస్తక ప్రచురనకు పిఆర్‌హెచ్‌ఐ వెనుకడుగు వేసిందనేది కాంగ్రెస్ ఆరోపణ.అటు పుస్తకంలోని కంటెంట్ పై బీజేపీ పలు ప్రశ్నలు, అనుమానాలు లేవనెత్తింది. సోనియా గాంధీ రాసిన పుస్తకం ఆత్మకథనా లేక కల్పిత గాధనా అనేది తేలాలని అంటుంది. ఇది రచయిత్రి, ప్రచురణకర్త తేల్చుకోవాల్సిన విషయంగా కమలనాథులు చెబుతున్నారు. ఆత్మకథగా పేర్కొన్న పుస్తకం కల్పిత కథ అయితే, ప్రచురించడానికి ముందు పబ్లిషర్ దానిని తప్పక పరిశీలిస్తారనేది బిజెపి వాదన. ఆత్మకథ పేరుతో కాంగ్రెస్ రాజకీయం చేయాలని చూస్తుందని ఈ పుస్తకం విడుదల విషయంలో కాంగ్రెస్ నేతలు అల్లుతున్న స్టోరీలు చాలా విడ్డూరంగా ఉన్నాయని బిజెపి కౌంటర్ అటాక్ చేస్తుంది.భారత్‌లో బిలాంగింగ్ పుస్తక పంపెనీదారు ఎవరనే విషయమై ఇప్పటికీ ఇంకా స్పష్టత రాలేదు. అయితే, ఈ బుక్ వెర్షన్ రూ. 2615 ప్రీ ఆర్డర్ కోసం అందుబాటులో ఉన్నట్లు అమెజాన్ ఈ కామర్స్ వెబ్సైట్ చూపిస్తోంది. ఈ వెబ్‌సైట్ ప్రకారం.. సోనియా గాంధీ ఆత్మకథ ఈ బుక్‌ను బ్రిటన్‌కు చెందిన హార్పర్‌కాలిన్స్ అనుబంధ విభాగం విలియం కాలిన్స్ ప్రచురించింది. మరి వివాదంతో మొదలైన ఈ పుస్తకం ముందుముందు రాజకీయంగా ఎలాంటి రచ్చలు రాజేస్తుందన్న ఉత్కంఠ పొలిటికల్ వర్గాల్లో పెరుగుతోంది

# దక్షిణం రాదు, ఉత్తరమూ పోతుందా?




పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే బీజేపీకి వచ్చే లోక్‌సభ ఎన్నికలలోనూ దక్షిణ భారతం వశపడదు. ఆ మాట వారికీ తెలుసు. అయితే ఈ సారి ఉత్తర భారతం కూడా చేజారిపోవచ్చునా? ఆ విషయం ఇప్పటికిప్పుడైతే నిర్ధారణగా అంచనా వేయలేము. కానీ ఆ ప్రమాదమైతే ఉన్నట్టు ఆ పార్టీ నాయకత్వానికి అర్థమవుతున్నదనుకోవాలి. అందుకే ముందు జాగ్రత్త కోసం తిమ్మిని బమ్మిని చేసైనా ఇతర పార్టీలను చీల్చటం, 'సర్' పేరిట ఓటర్ జాబితాలను గందరగోళంగా మార్చటం చేస్తున్నారు. ఈ వక్రమార్గాలనైతే అధికార దుర్వినియోగంతో అనుసరించగలరు గానీ, ప్రజల్లో ప్రబలుతున్న వ్యతిరేకతను ఏం చేయగలరు?

కొరకరాని కొయ్యగా మారిన దక్షిణాపథం గురించి ఎన్నెన్ని శపథాలు చేసి ఏమేమి వ్యూహాలు రచించినా, ఆ నేల స్వాధీనం కాకపోగా ఈ సారి 2019 నాటి 31 స్థానాలైనా రాగల సూచనలు లేవు. నియోజకవర్గాల పునర్విభజన, సర్ ఎత్తుగడలు అమలుకు వచ్చినప్పటికీ. కారణం, వారిక్కడ స్వయంగా క్షేత్రస్థాయిలో బలపడుతున్నది.

'పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే' అన్నమాటకు మొదట కొన్ని వివరణలు చెప్పుకోవాలి. బీజేపీ 2009లో గెలిచిన లోక్‌సభ స్థానాలు 116. ఆ సంఖ్య 2014లో ఒకేసారి 166 పెరిగి 282కు చేరింది. అధికారం లభించింది. లోగడ వాజపేయి నాయకత్వంలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా సొంత మెజారిటీతో అధికారానికి రావటం ఇదే మొదటిసారి. అట్లా జరగటానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. ఒకటి, అప్పుడు ఉండిన మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి, అసమర్థ పాలన విమర్శలను ప్రజలు నమ్మటం. రెండు, బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోదీ ముఖ్యమంత్రిత్వ కాలంలో గుజరాత్ అద్భుతంగా అభివృద్ధి చెందిందనే ప్రచారాలతోపాటు, అదే తరహా గుజరాత్ మాడల్‌ను దేశమంతటా అమలు చేయగలరనే ప్రచారాన్ని కూడా విశ్వసించటం. అందువల్లనే పార్టీ బలం అనూహ్యంగా పెరిగింది. ఆ విధంగా ఐదేండ్లు గడిచినాక, ఆ ప్రచారాలు నిజం కాదని ప్రజలకు అర్థం కావటం నెమ్మదిగా మొదలైంది. గుజరాత్ మాడల్ గురించిన వాస్తవాలు వెలుగులోకి రాసాగాయి.

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లోని నల్లధనాన్ని తెప్పించి ప్రతి కుటుంబానికీ రూ.15 లక్షలు ఇవ్వడం వంటి హామీలు వగైరా వట్టివిగా తేలాయి. అయినప్పటికీ మరుసటి 2019 ఎన్నికల్లో బలం తగ్గకపోగా 282 నుంచి 303కు పెరిగింది.

ఎందువల్ల? ఒకటి, మోదీపై భ్రమలు ఇంకా తగినంతగా పోలేదు. రెండు, అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని, ఇతరత్రా కూడా మత భావనలను బాగా పురికొల్పారు. మూడు, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల బలహీనతలు, అనైక్యతలు బీజేపీకి కలిసివచ్చాయి. నాలుగు, మోదీని మించిన నాయకుడు లేడని, తనను యావత్ ప్రపంచం కీర్తిస్తున్నదని, ఆయన చైనా, పాకిస్థాన్‌లకు తగిన శాస్తి చేశారనే ప్రచారాలు హోరెత్తించారు. ఐదు, ఆర్థిక రంగంలో మనం బ్రిటన్, జర్మనీ, జపాన్‌లను మించిపోయి, ప్రపంచంలో మూడో స్థానానికి ఎదిగామని, ఇక పోటీ చైనా, అమెరికాలతోనేనని లెక్కలు గట్టి చూపారు. మామూలుగానైతే ప్రజలు ఈ తరహా ప్రచారాలను గత ప్రచారాల వలెనే నమ్మాలి. నమ్మినవారు లేరని కాదు. చాలానే ఉన్నారు. కానీ నమ్మని వారి సంఖ్య పెరగటం మొదలైంది. అందుకే సీట్ల సంఖ్య 2024 ఎన్నికల్లో వారు ఆశించినట్టు 2019 నాటి 303 కన్నా మరింత పెరుగలేదు. సరికదా 2014 నాటి 282 కంటే కూడా తగ్గిపోయి 240 దగ్గర ఆగిపోయింది. ఈ లెక్కలు మరింత సూటిగా అర్థమయ్యేట్టు చెప్పుకొందాము. 2009లో 116; 2014లో 282; 2019లో 303; 2024లో 240. అనగా 2019 కన్నా 63 సీట్లు, 2014 కన్నా 42 సీట్లు తక్కువ. ఇవి స్పష్టంగా పతన సూచీలు.

మరొక విధంగా చెప్పాలంటే, మోదీ నాయకత్వం 2014లో, 2019లో సంపాదించిన సొంత మెజారిటీలు రెండు ఎన్నికలు గడిచి మూడోది వచ్చేసరికి తుడిచిపెట్టుకుపోయాయన్నమాట. ఇప్పుడు 'మోదీ మాడల్' అనే మాటను ప్రజలు మరచిపోయారు. స్వయంగా బీజేపీ కూడా అనటం లేదు. ఆ నమూనాలో పరిపాలన అంటే ఏమిటో ఎవరూ చర్చించటమైనా వినిపించదు. ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరిన మాట నిజం కాదని, ఇంకా ఆరో స్థానంలోనే ఉన్నామని తెలిసిపోయింది. ఈ తరహా స్థానాల మాట ఎట్లున్నా వేర్వేరు అభివృద్ధి సూచీలు అన్నింటిలో ఇతర దేశాలతో పోల్చినప్పుడు మన ర్యాంకులు పతనమవుతుండటమే కనిపిస్తున్నది. రూపాయి విలువ దారుణంగా పతనమవుతున్నది. ధరలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వివిధ దేశాల పర్యటనలు జరిపి అక్కడి నాయకులను ఎంత కౌగిలించుకుంటున్నా వారు మనను తమ ఆర్థిక ప్రయోజనాల కోసం, సైనిక వ్యూహాల కోసం ఉపయోగించుకొనజూడటం మినహా నిజమైన గౌరవం అంటూ పెరుగుతున్నదిలేదని బోధపడుతున్నది. అమెరికా అధ్యక్షుడు తరచూ ఈసడిస్తున్నా, ఇజ్రాయెల్ ప్రధానితో మితిమీరిన మైత్రీబంధం ఎంత అప్రదిష్టను తెస్తున్నా మోదీ తీరు మారకపోవటాన్ని ఇప్పుడందరూ గుర్తిస్తున్నారు. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే అన్నమాట పరిధిలోకి ఇవన్నీ వస్తాయి. ఇవేకాదు, మరికొన్ని కూడా ఉన్నాయి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతి అట్లుంచి 12 ఏండ్లలో కలిపి కూడా అవి కనిపించటంలేదు.

ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్నది ఓట్ల కోసం చెప్పిన మాట అని ఇప్పుడు వారు కూడా సిగ్గు విడిచి ఒప్పుకొంటున్నారు. నల్లధనం వెనుకకు రాకపోగా మరింత తరలిపోతున్నది. వేలకు వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను ఎగవేసి విదేశాలకు పారిపోయిన వారిలో కనీసం ఒక్కరినైనా గత 12 ఏండ్లలో వెనుకకు రప్పించలేకపోయారు. ఇదంతా చాలదన్నట్టు తమకు అనుకూలురైన ధనవంతుల బ్యాంకు అప్పులను లక్షల కోట్ల రూపాయల మేర మాఫీ చేస్తున్నారు. ఆ భారమంతా ఏదో రూపంలో తమపై పడేదేనని ప్రజలకు అర్థమవుతున్నది. ప్రైవేటీకరణను కొత్త పుంతలు తొక్కిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను తమ వారికి విచ్చలవిడిగా కట్టబెడుతున్నారు. ఆగస్టు 29 నాటికి ఒక వార్త ప్రకారం, టెక్సాస్ టెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు జరిపిన ఒక అధ్యయనంలో మోదీ 2014లో ప్రధాని కాకపోయి ఉంటే ఇండియా మరింత సంపన్నం, ప్రజాస్వామికం అయి ఉండేది. ఇటువంటి పరిపాలనా ఫలితంగానే బీజేపీ బలం ఒక్కసారిగా, అనూహ్యమైన రీతిలో 2024 ఎన్నికల్లో పడిపోయింది. ఇతరుల మద్దతు లేనిదే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఎదురై పార్టీ నాయకత్వాన్ని, సంఘ్ పరివార్ నాయకత్వాన్ని కూడా భయపెట్టింది. దానితో ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ అంతటి వ్యక్తి ఎన్నడూలేని రీతిలో బీజేపీ నాయకత్వంపై తీవ్రమైన విమర్శలు చేయవలసివచ్చింది. అయితే, కాళ్ల కింద నేల దక్షిణాదిన ఎన్నడూ అందకపోగా, ఉత్తరాన కూడా కదలిపోతున్నట్టు అర్థమై కూడా నాయకత్వం సక్రమ మార్గంలో నిలదొక్కుకోవటానికి ప్రయత్నించే బదులు వక్రమార్గాలను అనుసరిస్తుండటం ఉపయోగపడకపోగా వారికే కొత్త ముప్పుగా మారగల అవకాశాలు కనిపిస్తున్నాయి. కొరకరాని కొయ్యగా మారిన దక్షిణాపథం గురించి ఎన్నెన్ని శపథాలు చేసి ఏమేమి వ్యూహాలు రచించినా, ఆ నేల స్వాధీనం కాకపోగా ఈ సారి 2019 నాటి 31 స్థానాలైనా రాగల సూచనలు లేవు. నియోజకవర్గాల పునర్విభజన, 'సర్' ఎత్తుగడలు అమలుకు వచ్చినప్పటికీ. కారణం, వారిక్కడ స్వయంగా క్షేత్రస్థాయిలో బలపడుతున్నది 2014కు ముందు గానీ, అప్పటి నుంచి ఈ 2026 వరకు పన్నెండేండ్లలో గానీ స్వల్పమే కాగా, ఇప్పుడు జాతీయ స్థాయిలో ఆవరిస్తున్న కారుమేఘాలు ఇక్కడ కూడా కమ్ముకుంటున్నాయి. వాటిని పారదోలగల నాయకులు కనిపించటంలేదు. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే అని మొదట అనుకున్న మాటలు, మరింత దట్టం కావొచ్చునని ఇటీవలి పరిణామాలు సూచిస్తున్నాయి. అవి అందరూ చర్చిస్తున్నవే అయినా సందర్భం వచ్చింది గనుక మరొకమారు చెప్పుకోవాలంటే, 'సర్' మాయాజాలం వల్ల మోదీపై ప్రజలకు అనుమానాలు వేగంగా పెరిగిపోతున్నాయి. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం మరికొన్ని కారణాలు. అవినీతి కుంభకోణాలు, ధనిక వర్గాల అనుకూలతలు, విచ్చలవిడి ప్రైవేటీకరణలు 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అసంతృప్తిని ఎట్లా పెంచాయో ఇప్పుడు కూడా అదే జరుగుతున్నది.

అధికారం కోసం సీబీఐ, ఈడీ, పన్నుల శాఖలను, ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగపరచటం, కోర్టులను, మీడియాను లొంగదీసుకోవటం, ప్రతిపక్షాలను ప్రలోభాలతో చీల్చటం, మొత్తం దేశంలోనే భయకంపిత వాతావరణాన్ని సృష్టించి ఒక్కొక్క స్వేచ్ఛనే నేలరాయటం, ఇతర మతాల వారిపై ద్వేషభావాలు పెచ్చరిల్లజేసి అణచివేయటం వంటివి క్రమంగా పరాకాష్ఠ స్థితికి చేరుతున్నాయి.

భారత ప్రజాస్వామ్యం అర్ధ ఫాసిజంగా మారుతున్నదనే చర్చలు సైతం దేశవిదేశాలలో మొదలయ్యాయి. అయితే, ఎంత బలమైన గొలుసుకైనా ఎక్కడనో ఒక బలహీనమైన లంకె ఉంటుందనే సామెత ఒకటి ఇంగ్లిషులో ఉన్నది. 'పరిస్థితులు ఇదే విధంగా' అన్నమాటలోకి ఆ విధమైన ఇటీవలి పరిణామాలు కొన్నికూడా వస్తాయి. ఆ విధంగా మూడు ఘటనలు గత కొద్ది మాసాల్లో వెంటవెంటనే చోటుచేసుకున్నాయి. ఒకటి కాక్రోచ్‌లు, రెండు రామమందిర నిధుల తస్కరణలు, మూడోది మూడు ఉప ఎన్నికలు. వాటి ప్రభావాలపై విస్తృతమైన చర్చలు జరుగుతూనే ఉన్నందున ఇక్కడ ఇంకా మాట్లాడనక్కరలేదు. అయితే ఈ మూడు ప్రభావాలు ఉత్తరాది పైనే ఎక్కువగా ఉండటం గమనించదగ్గది. అవే వారి ప్రమాదఘంటికలు అవుతున్నాయి.

బీజేపీ అధికారసౌధపు కర్ర స్తంభాలకు, దూలాలకు చెదలు పట్టడం మొదలైనట్టు గత ఎన్నికల్లోనే వెల్లడైంది. ఇప్పుడు జరుగుతున్నది ఆ సౌధాన్ని చెదలు మరింత డొల్లగా మార్చుతుండటమే. ఆ స్థితిని మార్చగల దృక్పథాలు శక్తిసామర్థ్యాలు, రుజుధోరణులు, నిజాయితీలు, సాహసాలు నాయకత్వాలకు లేవు. వారికి గల లక్షణాలన్నీ చతురోపాయాలతో అధికారాన్ని అనుభవించజూడటం మాత్రమే. ఈ దేశ ప్రజలు వేచి చూడవలసింది ఈ కృత్రిమ సౌధపు శిథిల ఘడియల కోసమే. దక్షిణం ఎట్లాగూ దక్కదు. జరుగవలసింది చేజారుతున్నట్టు కనిపిస్తున్న ఉత్తరం నిజంగానే చేజారటం.

# ప్రైవేట్ రంగంలోకి డిఫెన్స్

**న్యూఢిల్లీ :** మనదేశంలో ప్రైవేట్ వ్యవస్థ అన్ని రంగాలకు విస్తరించింది. ఇంతవరకు ప్రైవేట్ రంగం తొంగి చూడని కొన్ని రంగాలు ఉన్నాయి. అందులో డిఫెన్స్ రంగం ముందువరుసలో ఉంటుంది. అయితే ఇప్పుడు ఇందులో కూడా ప్రైవేట్ ప్లేయర్స్ వచ్చేసారు.ఇండియన్ డిఫెన్స్ టెక్నాలజీని పూర్తిగా మార్చేయడానికి భారత ప్రభుత్వం ప్రవేట్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది. దీని మీద కొంతమంది విమర్శలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆత్మ నిర్భర్ భారత్ అంటూ సరికొత్త పథకాన్ని తీసుకొచ్చి.. దేశాన్ని విదేశీ దిగుమతుల మీద ఆధారపడడాన్ని తగ్గించారు. ప్రైవేట్ కంపెనీలకు డిఫెన్స్ రంగంలో అవకాశం కల్పించడం అనేక కారణాలు ఉన్నాయి. ప్రైవేట్ కంపెనీల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. డ్రోన్ టెక్నాలజీ వ్యవస్థ ఉంది. వాటిని ఇండియన్ డిఫెన్స్ రంగంలో వాడబోతున్నారు.. ప్రభుత్వ రంగ సంస్థలతో పోల్చి చూస్తే ప్రైవేట్ కంపెనీలు అత్యంత వేగంగా ఉత్పత్తులను తయారుచేస్తూ ఉంటాయి. అందువల్లే ఆ కంపెనీలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచింది. ఇక దేశీయంగా చూసుకుంటే రక్షణ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశంలో డిఫెన్స్ పరికరాలు తయారు చేయడం వల్ల రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గుతాయి. విదేశీ కరెన్సీ భారం తగ్గుముఖం పడుతుంది. ప్రైవేట్ కంపెనీల వల్ల భారతదేశం గ్లోబల్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్





హబ్ గా మారుతుంది. ఇతర దేశాలకు ఆయుధాలను ఎగుమతి చేసే ఆస్కారం లభిస్తుంది.. ఇక తాజా ఒప్పందల ద్వారా టాటా, రిలయన్స్, ఎల్ అండ్ టి, కళ్యాణి వంటి భారత ప్రైవేట్ కంపెనీలకు ఆర్డర్లు లభించబోతున్నాయి.రిలయన్స్.. టాటా.. ఎల్ అండ్ టి.. కళ్యాణి గ్రూప్ సంస్థలు ఇప్పటికే మిస్సైల్స్.. యుద్ధ విమానాలు.. సబ్ మెరైన్లు తయారు చేస్తున్నాయి.. భారతదేశం రక్షణ సాంకేతికతను ప్రైవేట్ కంపెనీలతో పంచుకోవడం వెనుక ప్రధాన కారణం కూడా ఒకటుంది. సైనిక దళాల ఆధునికీకరణ వేగవంతం చేయడం.. దేశీయ రక్షణ ఉత్పత్తిని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడం.. ప్రభుత్వ పరిశోధన సంస్థ అయిన డిఆర్డిఓ డెవలప్ చేసిన టెక్నాలజీని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తూ ఉంటుంది. దీనివల్ల వేగవంతమైన భారీ ఉత్పత్తి చోటు చేసుకుంటుంది. ప్రైవేట్ కంపెనీల వద్ద ఉన్న అత్యాధునిక ప్లాంట్లు.. మౌలిక సదుపాయాల ద్వారా ఆయుధాలను వేగంగా తయారు చేయవచ్చు. భారీగా ఉత్పత్తి చేయవచ్చు.. ప్రయోగశాలకే పరిమితమైన సాంకేతికతను ప్రైవేట్ రంగానికి ఇస్తే అవి త్వరగా ఇద్దరంగానికి అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థల మీద భారం తగ్గుతుంది.. హెచ్ ఏ ఎల్, బి ఈ ఎల్ వంటి ప్రభుత్వ రక్షణ సంస్థలపై ఉన్న అదనపు పని భారం తగ్గుతుంది. ప్రైవేట్ కంపెనీలను భాగస్వాములను చేస్తే ఉత్పత్తి మరింత పెరుగుతుంది. ప్రైవేట్ రంగంలో పోటీ ఉండడంవల్ల రక్షణ పరికరాల తయారీ ఖర్చు పూర్తిగా తగ్గుతుంది. రాడార్లు.. కమ్యూనికేషన్ సిస్టం వంటి వాటి తయారీ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది.. అంతర్జాతీయ రక్షణ మార్కెట్లో భారతీయ ప్రైవేట్ కంపెనీలో భాగస్వాములు కావడానికి సాంకేతికత తోడ్పడుతూ ఉంటుంది. ఇప్పటికే డిఫెన్స్ పరికరాల తయారీ విషయంలో అమెరికా దూకుడుగా ముందుకు వెళ్తోంది. చైనా కూడా ఆదే స్థాయిలో ఉంది. ఇజ్రాయిల్.. ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. వీటన్నిటికి చెక్ పెట్టి అగ్రస్థానంలో ఉండాలి అంటే భారత్ కచ్చితంగా ఈ మార్పులకు శ్రీకారం చుట్టాల్సిందే.

నవగీతం
బుధవారం
2 సెప్టెంబర్ 2026

# వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి..
యువతను దేశ భవిష్యత్తుతో అనుసంధానించాలి
నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప ఉత్సవాలు' : పీవీఎన్ మాధవ్




**విజయవాడ, సెప్టెంబరు 1** వికసిత్ భారత్ నిర్మాణంలో సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవాలు' నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడ రామారావు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కార్యశాలను ఆయన ప్రారంభించారు. ప్రధాని మోదీ దేశం కోసం పూర్తి స్థాయి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని మాధవ్ పేర్కొన్నారు. సమస్యలు, సవాళ్లను ముందుగానే గుర్తించి పరిష్కారాలు చూపుతూ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని అన్నారు. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మోదీకి విశేష గుర్తింపు లభించిందన్నారు. త్రివర్ణ పతాకానికి అంతర్జాతీయంగా గౌరవం పెరగడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.కోవిడ్ సమయంలో ప్రపంచ దేశాలు భారత్ తీవ్రంగా దెబ్బతింటుందని భావించాయని, అయితే దేశీయంగా వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి ప్రజలకు అందించడంతో పాటు ఇతర దేశాలకు కూడా సరఫరా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇబ్బంది లేకుండా ముందుచూపుతో క్రూడ్ ఆయిల్ నిల్వలను ఆరు నెలలకు సరిపడా సిద్ధం చేసినట్లు తెలిపారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ సాధించిన అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న ప్రజల ఆకాంక్ష మేరకు ఆయన ప్రధానిగా ఎదిగారని మాధవ్ అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేరాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

**పిల్లల ఆలోచనలకు పదును పెట్టాలి**

సేవా సంకల్ప ఉత్సవాల దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసి దేశ నిర్మాణంతో అనుసంధానం చేయాలని సూచించారు. 15 ఏళ్ల వయసు నుంచే పిల్లల్లో వికసిత్ భారత్‌పై అవగాహన కల్పించాలన్నారు.పాఠశాలలకు వెళ్లే కార్యకర్తలు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని విద్యార్థులతో వినయంగా మమేకం కావాలని సూచించారు. గతంలో దేశం ఎలా ఉంది? ప్రస్తుతం ఎలాంటి మార్పులు వచ్చాయి? ఆ మార్పులకు కారణాలేమిటి? భవిష్యత్ భారత్ ఎలా ఉండాలి? అనే అంశాలపై విద్యార్థులతో చర్చలు నిర్వహించాలని చెప్పారు.డ్రాయింగ్, వ్యాసరచన, ప్రసంగం, నాయకత్వ నైపుణ్యాల వంటి పోటీలు నిర్వహించి పిల్లల్లో దేశభక్తి, సృజనాత్మకతను పెంపొందించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్ భారతదేశాన్ని ఎలా చూడాలనుకుంటున్నారో వారి అభిప్రాయాలను సేకరించి వీడియోల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**మోదీ ఒక్కరి కల కాదు**

వికసిత్ భారత్ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరి బాధ్యత కాదని, దేశంలోని ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని ప్రజలకు వివరించాలని సత్యకుమార్ అన్నారు. ఆర్థిక, సైనిక, సాంకేతిక తదితర అన్ని రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచి విశ్వగురువుగా ఎదగాలన్న లక్ష్యాన్ని యువతకు వివరించాలని సూచించారు.సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని, పార్టీ గుర్తింపుకు మించి సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా కార్యకర్తలు ప్రజల విశ్వాసాన్ని పొందాలని పిలుపునిచ్చారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో దేశభక్తి, దేశం పట్ల బాధ్యత, సమాజ సేవ భావనలను పెంపొందిస్తే వారు భవిష్యత్తులో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశంరాష్ట్ర కార్యశాలను రాష్ట్ర ఇన్‌ఛార్జి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. అతిథులను పార్టీ ఉపాధ్యక్షురాలు నిర్మలా కిషోర్ వేదికపైకి ఆహ్వానించారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ సమారోప్ నిర్వహించారు.కార్యశాలకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్నలతో పీవీఎన్ మాధవ్ సమావేశమయ్యారు. పార్టీ కార్యక్రమాల రూపకల్పన, సేవా సంకల్ప ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పలు సూచనలు చేశారు.


# ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అంటూ బడాయి కొట్టే రేవంత్ రెడ్డి..

నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటు.
మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**హైదరాబాద్ :** గత రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అధ్యాపకులు, నాన్టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక నరకం చూస్తున్నారు. అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మీ తీరు వల్ల ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ఇప్పుడు దాదాపు 650కి పడిపోయింది. అంటే ఇప్పటికే సుమారు 310 కళాశాలలు తగ్గిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందని అన్నారు. దీని ప్రభావం అత్యధికంగా గ్రామీణ తెలంగాణపై పడుతుంది. చిన్న పట్టణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ కళాశాలలే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రధాన కేంద్రాలు. ఒక కళాశాల మూతపడటం అంటే ఆ ప్రాంతంలోని వందలాది, వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావడమే. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఉన్నత విద్యకు భరోసాగా నిలిచింది. ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులను ఏళ్ల తరబడి పెండింగ్లో పెట్టడం వల్ల ఆ భారం కళాశాలలు, అధ్యాపకులు, సిబ్బంది, చివరికి విద్యార్థులపైనే పడుతోంది. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ ఁ పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందించారు. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బందికి 5 నుంచి 10 నెలల వరకు జీతాలు పెండింగ్లో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని అన్నారు, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి 2500 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉంటే, ఆ బకాయిలు చెల్లించి ఆ పథకాన్ని కొనసాగించినం. కేసీఆర్ .. పెద్ద నోట్ల రద్దు జరిగినా, కరోనా విపత్తు వచ్చినా ఫీజు రియింబర్స్ మెంట్ ఆపలేదు.తొమ్మిదిన్నరేండ్లలో గత కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన బకాయిలతో సహా 19,500 కోట్లు ఫీజు రియింబర్స్ మెంట్ రూపంలో కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది. మేనిఫెస్టోలోనేమో. "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబీూ వర్గాల విద్యార్థులందరికి ఫీయి రియింబర్స్ మెంట్ తో పాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు" అన్నరు. ఇప్పటికి మూడు బడ్జెట్లు అయిపోయినయి. దాదాపు 10,000 కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నయి. వైయస్ఆర్ గారు ప్రారంభించిన పథకం అంటూ గొప్పలు చెప్పుకునే మీకు ఆ పథకాన్ని సక్రమంగా అమలు చేసే బాధ్యత లేదా? ఇది కేవలం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సమస్య కాదు.. విద్యార్థుల భవిష్యత్తు, అధ్యాపకులు, సిబ్బంది మనుగడకు సంబంధించిన సమస్య. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలి




**సిద్దిపేట :** వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, పలు అంశాలపైన సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవ నమహోత్సవం భాగంగా ప్లాంటేషన్ 83 శాతం పూర్తయిందని జిల్లా టార్గెట్ 17లక్షల 60 వేలకు గాను 14 లక్షల 63 వేలు ప్లాంటేషన్ చేశారని 100 శాతం ప్లాంటేషన్ పూర్తి చెయ్యాలని, పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.జలసిరి లో భాగంగా వర్షానికి పడిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టడం కోసం ప్రభుత్వం ఈ జలసిరి కార్యక్రమం చేపట్టిందని ఆయా మండలాల్లోని ఆశించిన స్థాయిలో పనుల్లో పురోగతి లేనందున అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రతి ఒక్కరిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఫాంపాండ్ కోసం రైతులను గుర్తించి వెంటనే పనులు మొదలు పెట్టాలని, బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ కోసం గ్రామంలో ఎన్ని ఇలాంటి బోర్లు ఉన్నాయి లెక్కించి ఆయా రైతులతో మాట్లాడి బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ వలన బోర్లలో నీటి శాతం పెరుగుతుందని తెలపాలి. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్, ఇంకుడుగుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, ముందుగా మండలంలోని ప్రభుత్వ భవనాలు అయిన గ్రామపంచాయతీ భవనాలు, స్కూల్స్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ భవనాలలు, ఎంపిక చేసుకుని ఎస్టిమేట్ వేసి రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలని ఏపిఓ లను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదటి విడతలో మంజూరు అయిన వాటిలో రూఫ్ లెవెల్ మరియు చిన్న చిన్న పనులు ఉన్న నిర్మాణాలను పూర్తి స్థాయిలో ఈ నెల 15 వరకు గృహ ప్రవేశాలు చేసేలా పని చెయ్యాలని, మార్కౌట్, గ్రౌండింగ్ కానీ వాటిని వెంటనే మొదలు పెట్టాలని, నిర్మాణంలో ఆలస్యం అవుతున్న వారితో స్థానిక ప్రజాప్రతిందులతో కలిసి చర్చించి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు.విబిజి రామ్ జీ లో చేపడుతున్న మండలాల వారిగా గ్రామాల్లో మంజూరు అయిన అంగన్వాడి, గ్రామపంచాయతీ భవనాలు, ఎస్ఎచ్ జీ భవనాలు పనులు మొదలు పెట్టని వాటిని గ్రామాల్లో గ్రామ సర్పంచ్ పాలకవర్గం తో సమావేశాలు నిర్వహించి భవనాలను మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవనాల నిర్మాణంలో ఉన్నవి భవనాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేయూత పెన్షన్లు డెత్ మార్కింగ్ వెరిఫై ప్రక్రియ పూర్తి చేసి క్లోజ్ చెయ్యాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ మరియు ఇంచార్జీ డిఆర్డిఓ రమేష్, డిపిఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పిడి భగవంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ ఎత్తివేయాలి

తల్లాడలో కాంగ్రెస్ శ్రేణులు ?నల్ల బ్యాడ్జీలతో నిరసన మరియు రాస్తారోకో



**తల్లాడ, సెప్టెంబర్ 01(నవగీతం):** ఉత్తరాఖండ్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై దురుద్దేశపూర్వకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తలడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో రాస్తారోకో నిర్వహించి, నాయకులు నల్ల బ్యాడ్జీలతో తమ నిరసన తెలిపారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి మరియు జిల్లా, మండల ముఖ్య నాయకుల నేతృత్వంలో ఈ ఆందోళన చేపట్టారు. కుల వివక్షకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు.

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ**

నిరసన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, సామాజిక న్యాయం మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు మండల స్థాయి కాంగ్రెస్ కమిటీ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు అలాగే పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# టి యూ సి ఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయండి




**తల్లాడ, సెప్టెంబర్ 01(నవగీతం):** తల్లాడ మండల కేంద్రంలో జనరల్ కౌన్సిల్ ప్రచారం నిర్వహిస్తూ వారుమాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గ పరిస్థితులు రోజుకి దిగజారి పోతున్నాయి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్సుగా మార్చి కార్మిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడింది సమ్మె హక్కును కాల రాసింది కార్మికులు సంఘటితంగా తమ ప్రజాసామిక హక్కుల కోసం అడిగే పరిస్థితి లేకుండా చేసింది. దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వదేశీ దేశభక్తి బిజెపి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో 100% పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది వానింజ ఒప్పందాలలో దేశ ప్రజలకు రైతులకు కార్మికులకు నష్టకరమైన ఒప్పందాలను కుదుర్చుకున్నది దేశంలోని కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు దేశ కార్మిక వర్గ శ్రమ శక్తిని పణంగా పెట్టింది. ఇలాంటి అనేక కేంద్ర ప్రభుత్వ విధానాలపై హర్యానా ఉత్తరప్రదేశ్ ఝార్ఖండ్ మహారాష్ట్ర గుజరాత్ తదితర ప్రాంతాలలో పారిశ్రామిక కార్మికులు వేలాది మందితో వీధిలోకి వచ్చి హక్కుల కోసం నినదించిన విషయం మనందరికీ తెలుసు అన్నారు

ఇలాంటి అనేక విశాలపై రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో విస్తృతమైన చర్చ జరిపి భవిష్యత్ కార్యక్రమాలు కార్మిక వర్గ పోరాటాలను రూపొందించుకోవడం జరుగుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో టి యు సి ఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్మియా తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు కిషోర్ వెంకటేశ్వర్లు నారాయణ యూసుఫ్ బిక్షం విష్ణు పుల్లయ్య అనిల్ రమణ రాఘవ తదితరులు పాల్గొన్నారు

## రామచంద్రరావు హౌస్ అరెస్ట్

**హైదరాబాద్ :** నల్గొండలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మొదలైన మాటల యుద్ధం, దాడుల వరకు వెళ్లడంతో ఉద్రిక్తతలకు దారితీశాయి. బీజేపీ నేత డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఉన్న రామచందర్ రావు నివాసంలో పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యగా ఆయనను హౌస్ అరెస్టు చేశారు. పోలీసులతో బీజేపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. నల్గొండ జిల్లాలో ఇటీవల బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆఫీసుపై బీజేపీ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేశాయి. అందుకు ప్రతిచర్యగా నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**నార్కట్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై భారీ నిరసన**

నల్గొండలో కాంగ్రెస్, బిజెపి శ్రేణుల మధ్య చెలరేగిన రాజకీయ దాడులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, బీజేపీ కార్యకర్తలు మంగళవారం నార్కట్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వ్యతిరేకంగా బిజెపి శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశాయి. ఈ ఆందోళన సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశాయి. ప్రతిపక్ష నేతలపై భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పార్టీ నేతలు మండిపడ్డారు. అధికారం చేతిలో ఉందని ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని, కాంగ్రెస్ వైఖరిని సహించేది లేదని బీజేపీ నేతలు హెచ్చరించారు.

## తెలంగాణ రక్షణ సేనకు బిగ్ షాక్

**బీజేపీలో చేరేందుకు సిద్ధమైన రామిరెడ్డి..**
**ఈటల రాజేందర్ తో కీలక భేటీ...**
**మేడ్చల్?మల్కాజిగిరి రాజకీయాల్లో కీలక పరిణామం.**
**త్వరలోనే కమలం గూటికి చేరుతానని రామిరెడ్డి స్పష్టీకరణ**

**మేడ్చల్ మల్కాజిగిరి :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి తెరలేచింది. తెలంగాణ రక్షణ సేనకు చెందిన మేడ్చల్?మల్కాజిగిరి నాయకుడు రామిరెడ్డి వెంకట్రెడ్డి బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నేడు కార్యకర్తలు, అనుచరులతో నిర్వహించిన భేటీలో ఆయన త్వరలోనే భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు స్పష్టం చేసినట్లు సమాచారం.తెలంగాణ రక్షణ సేనలో కీలకంగా పనిచేస్తున్న నాయకుడు బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధమవడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే వివిధ నియోజకవర్గాల్లో పార్టీని విస్తరించేందుకు తెలంగాణ రక్షణ సేన కార్యక్రమాలు

# కష్టపడి చదువుకోండి.. కలలను సాకారం చేసుకోండి"..

**కళాశాలను పరిశీలిస్తూ.. విద్యార్థులను ఆత్మీయంగా పలకరిస్తూ..**

**విద్యార్థులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆత్మీయ దిశానిర్దేశం**



**కరీంనగర్,సెప్టెంబర్1,(నవగీతం)** కళాశాలలోని వసతులను పరిశీలిస్తూ.. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ.. వారితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ.. వారి భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం చేస్తూ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆత్మీయత చాటారు. విద్యార్థులతో కలిసిమెలిసి మాట్లాడిన ఆమె.. వారి సమస్యలను తెలుసుకుని, "కష్టపడి చదువుకోండి.. ఉన్నత లక్ష్యాలను సాధించండి.. మీ కలలను సాకారం చేసుకోండి" అంటూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న వంటలను పరిశీలిస్తూ.. ఏం కూర వండుతున్నారని అడిగి తెలుసుకున్నారుఅన్నం నాణ్యతను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను సందర్శించి కూరగాయలు, పండ్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. "ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? భోజనం బాగుంటుందా? మెనూ ప్రకారం పెడుతున్నారా. చదువు ఎలా సాగుతోంది? యూనిఫామ్స్, పుస్తకాలు వచ్చాయా?" అంటూ ఒక్కో అంశంపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను ఓపికగా వింటూ వారికి భరోసా కల్పించారు. కళాశాలలోని రిజిస్టర్లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. క్రమశిక్షణ, సిన్సియారిటీతో చదువుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. కలలు కనడమే కాదు.. వాటిని సాకారం చేసుకునేందుకు ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, సిబ్బంది తదితరులు



పాల్గొన్నారు.

# ఆప్యాయతకు కేరాఫ్ అడ్రస్‌గా..

**వృద్ధులు, దివ్యాంగులకు మరింత మెరుగైన వసతులు.**

**వసతిగృహాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి..**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**





**కరీంనగర్,సెప్టెంబర్1,(నవగీతం):** వృద్ధులకు ఆప్యాయత.. దివ్యాంగులకు భరోసా.. వారి బాగోగులే లక్ష్యంగా కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ వృద్ధులు, దివ్యాంగుల వసతిగృహాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.మంగళవారం సాయంత్రం వసతిగృహాన్ని సందర్శించిన కలెక్టర్.. అక్కడి వృద్ధులు, దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.వసతిగృహంలో అందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇప్పటికే చేపట్టిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. గతంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి.. ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటి.. ఇప్పటివరకు ఎలాంటి పనులు నిర్వహించారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెయింటింగ్ పనులను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతిగృహంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వసతిగృహాన్ని అత్యద్భుతంగా ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపర్చాలని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనతో పాటు అవసరమైన మరమ్మతు పనులకు ఫేజ్-2 కింద మరిన్ని నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు, అంచనాలను సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతిని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సంక్షేమ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.వసతిగృహం కేవలం నివాస ప్రదేశంగా కాకుండా వృద్ధులు, దివ్యాంగులకు ఆత్మీయత, భద్రత, సౌకర్యం కలిగించే మంచి వాతావరణంగా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, వార్డెన్ రాధిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పేదల సామాజిక గౌరవానికి ప్రతీక నూతన రేషన్ కార్డు మంత్రి సీతక్క

పేదల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం.



**ములుగు, సెప్టెంబర్ 01,(నవగీతం)** పేదల సామాజిక గౌరవానికి ప్రతీక నూతన రేషన్ కార్డు అని, పేదల ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి దనసరి అనసూయసీతక్కఅన్నారు.ఆర్టీఓ కార్యాలయ సమావేశమందిరంలోమంళ వారం జిల్లా కలెక్టర్ బోర్ఖేడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క, ములుగు, మల్లంపల్లి మండలాల లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ములుగు మండలానికి 1,809, మల్లంపల్లి మండలానికి 621 చొప్పున మొత్తం 2,430 నూతన రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్కమాట్లాడుతూ, రేషన్ కార్డులు లేని కారణంగా అర్హులైన పేదలు సన్నబియ్యం పథకానికి దూరం కావద్దనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం నూతన కార్డులను మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ సంవత్సరంలో 12,802 నూతన రేషన్ కార్డుల ద్వారా 36,405 మంది కుటుంబ సభ్యులకు సన్నబియ్యం పథక ప్రయోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 15 లక్షలకు పైగా నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు వివరించారు. మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేయడం పేద కుటుంబాలకు భారంగా మారిందని, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడంతో ఆ కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని అన్నారు. గతంలో పెద్ద పరిమాణంలో ఉండే రేషన్ కార్డులను తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం జేబులో సులభంగా తీసుకెళ్లగలిగేలా స్మార్ట్ కార్డులను రూపొందించి అందిస్తున్నామని తెలిపారు. రేషన్ సరుకులు పొందడానికే కాకుండా వివిధ ధ్రువపత్రాల జారీ, ఆరోగ్యశ్రీ తదితర అవసరాలకు కూడా రేషన్ కార్డు ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన పేదలకు ప్రాధాన్యమిస్తూ నూతన కార్డులను అందిస్తున్నామని, ఇంకా కార్డులు అందని అర్హులకు రానున్న రోజుల్లో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ద్వారా పేదలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, డి సిఎస్ ఓ ఫైజల్ హుస్సేనీ, డిఎం కృష్ణవేణి, తహసిల్దార్లు నూతన రేషన్ కార్డుల లబ్ధిదారులు రేషన్ డీలర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం





**కరీంనగర్, సెప్టెంబర్1,(నవగీతం)** హుజురాబాద్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నుండి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమైందని సిడిపిఓ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతితో పాటు వెరిఫికేషన్ సభ్యుల బృందం పారదర్శకంగా ఈ ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. మంగళవారం సైదాపూర్ మండలంలోని గొడిశాల-1, గొడిశాల-2, సైదాపూర్-1, సైదాపూర్-2, శాలపల్లి అంగన్వాడీ కేంద్రాల టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహించామని తెలిపారు.హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కుమ్మరి వాడ, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి-1, సర్వాయిపేట అంగన్వాడి అభ్యర్థులకు 2 బుధవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

## కొండగట్టు అంజన్న సన్నిధి లో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

లక్ష తమలపాకులతో పూజ అర్చన



**కరీంనగర్,సెప్టెంబర్1,(నవగీతం)** మెగా యూత్ ఫోర్స్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కాస రాజు అద్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్బంగా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిదేవస్థానం లో లక్ష తమలపాకుల పూజ అర్చన అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జనసేన పార్టీ ఎమ్మెల్సీఅభ్యర్థి మాజీ తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్, రాష్ట్ర మున్నారు కాపు సంఘ అధ్యక్షులు కొండా దేవయ్య, విచ్చేసి పూజ కార్యక్రమం లో పవన్ కళ్యాణ్ గోత్ర నామాల తో పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ పి. రామకృష్ణ గౌడ్ ,రాష్ట్ర జనసేన నాయకులు, రాము యాదవ్ శ్రీరాముల సోమశేఖర్, శ్రీదేవి, పెంబి రజిత, మిర్యాల రామకృష్ణ, డా. రాజ్ కిరణ్,పెంబి. మహేందర్, ఎలగందుల అజయ్ చిలేవిరి సాయి, అబ్బూరి ఆనంద్ రాజ్ అడ్డగట్ల సురేష్ బి. జనార్ధన్, మానేరు జగదీశ్ రెడ్డి, జక్కని అఖిల్, కందుల రాజీ రెడ్డి ,అన్వేష్ ,వేముల శిరీష, మొగిలిపాలెం రమేష్,గణేష్ కళ్యాణ్, కనకట్ల శ్రీనివాస్, పొన్నాల తిరుపతి, వీర్ల శ్రీనివాస్ రావు జంగా మహేష్, కుమార్ కొను శ్రీకాంత్, దృడం శ్రీనాథ్, గొంటి సంజీవ్, సంకీర్తన్అజయ్ మరియు సేనతో సేనాని టీంతో పాటు మెగా అభిమాన సంఘం నాయకులు ఉమ్మడి జిల్లాలో ఉన్న జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయిలో

పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్





**జగిత్యాల, సెప్టెంబర్01,(నవగీతం):**జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి అందిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను సంబంధిత స్థలాల్లో పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, స్థల పరిస్థితి, లేఅవుట్‌కు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా నమోదు చేసి, అర్హత కలిగిన దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలను టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భర్త మరణంతో ఆగని ఎన్టీఆర్ భరోసా

**మరుసటి నెల నుంచే భార్యకు ఎన్టీఆర్ వితంతు పింఛను**

**ఏపీ ప్రభుత్వం మానవీయ నిర్ణయం.× ఎదురుచూపులకు చెక్**

**నెల తిరగకుండానే వితంతువులకు రూ.4000 పింఛను మంజూరు.**

**తుగ్గలి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో వితంతు మహిళలకు భరోసా కల్పిస్తూ కీలక సంస్కరణలు చేపట్టింది.ఈ నూతన కీలక సంస్కరణల వలన తుగ్గలి మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లె గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మంగళ నారాయణ మృతి చెందడంతో,భర్త చనిపోయిన మరుసటి నెలకి మంగళ లక్ష్మీదేవి కు ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్ మంజూరు అయింది.మంగళవారం రోజున ఉప్పర్లపల్లె గ్రామం సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉప్పర్లపల్లె సొసైటీ అధ్యక్షులు అప్పా వేణు ఆమెకు పింఛన్ ను అందజేశారు.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు అప్పా వేణు మాట్లాడుతూ గతంలో పింఛను పొందుతున్న భర్త మరణిస్తే,భార్యకు వితంతు పింఛను రావడానికి 6 నుంచి 7 నెలల సమయం పట్టేది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న వితంతు

# ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేయాలి :

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**
**ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి**
**అట్రాసిటీ బాధితులకు సత్వర పరిహారం, ఉద్యోగాలు అందేలా చర్యలు**
**ఎస్సీ ప్రాంతాలకు 15 శాతం, ఎస్టీ ప్రాంతాలకు 10 శాతం నిధుల కేటాయింపు**
**అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత**
**ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**జగిత్యాల,సెప్టెంబర్01,(నవగీతం)** ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ లతతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు, అంతర్ కుల వివాహ ప్రోత్సాహకాలు, పీఎం అజయ్ పథకం, అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మున్సిపల్ కార్మికులకు బీమా, టూ బీహెచ్‌కే ఇళ్లు, పీఎం విశ్వకర్మ, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్, కులాంతర వివాహ ప్రోత్సాహక పథకాలకు సంబంధించిన పెండింగ్ నిధులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఎంత పరిహారం అందించారు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో సమగ్ర నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు సమర్పించాలి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సమర్పించాలని కమిషన్ చైర్మన్ సూచించారు.

ఎస్.డీ.ఎఫ్.,సీ.డీ.పీ.,ఎం.పీ.ల్యాడ్స్ నిధులు మంజూరు చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ప్రాంతాల అభివృద్ధికి 15 శాతం, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని తెలిపారు. కేటాయించిన నిధులతో పనులు సక్రమంగా చేపట్టకపోతే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రూ.2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను సద్వినియోగం చేయాలి

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు రూ.2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని



అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంచి రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ నిధులతో చేపట్టాల్సిన పనులకు అవసరమైన అంచనాలను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈలు సిద్ధం చేసి సమర్పించాలని, నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించారు.

**నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరి**

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల సమయంలో కూడా రిజర్వేషన్ రోస్టర్‌ను తప్పనిసరిగా పాటించాలని కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు. పదోన్నతుల్లో కూడా రోస్టర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని మూడు పట్టణ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నందున వారికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో రూ.30 లక్షల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు కూడా ఎస్.బి. ఐ. బ్యాంక్ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలే లక్ష్యం**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.అంగన్‌వాడీ భవనాల అనంతరం మహిళా భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలను విబిజిరామ్ జీ కింద, పట్టణ ప్రాంతాల్లో సిడిపి కింద ప్రతిపాదించాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనంలో నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

**అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం పెంచాలి**

ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీకి పాల్పడే వారికి చట్టంపై భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు, విచారణను సమర్థవంతంగా నిర్వహించి శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మండల కేంద్రాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, తహసీల్దార్లు, ఎస్ఐలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కేంద్ర ప్రదేశాల్లో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ శాఖ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు.

అట్రాసిటీ బాధితులకు 2బీహెచ్‌కే ఇళ్లు

ఎస్సీ, ఎస్టీ హత్య, అత్యాచార కేసుల్లో బాధిత కుటుంబాలకు 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని





కమిషన్ చైర్మన్ సూచించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ విధానం అమలు చేస్తున్నామని, దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ తరహా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ జిల్లాలో 85 కులాంతర వివాహ ప్రోత్సాహక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి సుమారు రూ.2.42 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల్లో ఐదుగురికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు.వారం రోజుల క్రితం 185 మంది బాధితులకు రూ.1.06 కోట్లకు పైగా పరిహారం విడుదలైందని, ఆ మొత్తం వెంటనే వారి ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. మరో 91 మంది బాధితులకు రూ.69.45 లక్షల పరిహారం పెండింగ్‌లో ఉందని, ఉన్నతాధికారుల సమాచారం మేరకు వారంలోగా విడుదల కానుందని వివరించారు. పీఎం అజయ్ పథకం కింద 144 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, మరో 30 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద 317 యూనిట్ల లక్ష్యానికి గాను 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వివరించారు.

గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 973 ఎస్సీ, 138 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 870 కేసుల్లో ట్రూ ఎఫ్ఐఆర్ ఫైనలైజ్ కాగా, 787 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు వివరించారు. 295 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలైనట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు ప్రాధాన్యతతో తీసుకొని, పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మి నారాయణ, ప్రవీణ్, ఆర్డీవోలు, డిఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, సంబంధిత అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్ లు, ఎంపిడివోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.

**70 గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా పనులు వేగవంతం చేయాలి.జిల్లా కలెక్టర్.**

**ములుగు ,సెప్టెంబర్ 01,(నవగీతం)** ములుగు జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి తో కలిసి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ-సర్వే, భూభారతి, తదితర రెవెన్యూ అంశాలపై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించుకొని, దాని ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

రామచంద్రపురం గ్రామంలో రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసి, రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించేందుకు రూపొందించిన పట్టా పాస్ పుస్తకాల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత రికార్డులు, రైతుల వివరాలను పక్కాగా పరిశీలించి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ, భూ సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా చూడాలన్నారు. అధికారులు తమ పరిధిలో



చేపట్టాల్సిన పనులకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకొని, నిర్దేశించిన గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్, అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బొల్లారం పాఠశాల ను సందర్శించిన మొరుమూరు సర్పంచ్.



**ములుగు సెప్టెంబర్ 01.(నవగీతం)** వాజేడు మండలం మొరుమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బొల్లారం ప్రాథమిక పాఠశాలను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మంగళ వారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో పంచాయతీ సిబ్బంది చే పారిశుధ్య చర్యలు చేపట్టారు. వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల లో భాగంగా రహదారులు, మురుగు నీరు నిలిచే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమానికి మొరుమూరు పంచాయతీ సర్పంచ్ మడకం సుభద్ర, కార్యదర్శి కార్తీక్, వార్డు సభ్యులు కుర్శం శంకర్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రైవేట్ స్కూలుకు దీటుగా ఐడీ కార్డుల పంపిణీ

**గుర్తింపు కార్డులు పంపిణి చేసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్**




**కొడిమ్యాల సెప్టెంబర్ 01(.నవగీతం ).** చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సుమారు 300 మంది విద్యార్థినీ, విద్యార్థులకు తన సొంత నిధులతో రూ.20 వేల వ్యయంతో ఐడీ కార్డులను తయారు చేయించి పంపిణీ చేశారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో మెరుగైన సౌకర్యాలు, గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్ సేవా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కొత్తూరు మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల మాదిరిగా ఐడీ కార్డులు ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల అవసరాలకు తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే విద్యను శ్రద్ధ, ఏకాగ్రతతో అర్థం చేసుకుని అభ్యసించాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు ఎదగాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపల్ బి లావణ్య మాట్లాడుతూ గ్రామస్తులు నాయకుల సహకారంతో విద్యార్థులు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పాఠశాల ప్రగతి పథంలో సాగుతుందని ప్రిన్సిపాల్ బి లావణ్య అన్నారు.విద్యార్థుల కోసం సొంత నిధులతో ఐడీ కార్డులు అందజేసిన కొత్తూరు మహేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నవగీతం కథనానికి అధికారుల తక్షణ స్పందన

**14వ వార్డులో పిచ్చి మొక్కలు, పొదల తొలగింపు**



కొడిమ్యాల,సెప్టెంబర్ 1 (నవగీతం) కొడిమ్యాల మండల కేంద్రంలోని 14వ వార్డులో పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు పెరిగి దోమల బెడద అధికమవుతోందని మాజీ వార్డు సభ్యుడు రాచకొండ చంద్ర మోహన్ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగస్టు31వ తేదీ లో 'నవగీతం' దినపత్రికలో కథనం ప్రచురితమైంది.కథనంపై స్థానిక అధికారులు వెంటనే స్పందించారు. మంగళవారం 11.వ వార్డులో పిచ్చి మొక్కలు, పొదలను తొలగించే పారిశుధ్య పనులను సిబ్బందితో ప్రారంభించారు. మిగతా వార్డుల్లోనూ సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించి దశలవారీగా పారిశుధ్య పనులు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.దోమల బెడద నివారణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు నిరంతరం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. తమ ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి పనులు ప్రారంభించడంపై చంద్ర మోహన్‌తో పాటు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.






## రష్మిక నుంచి బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు.. మైసా రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇప్పటికే విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్న ఈ భామ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'మైసా' విడుదల తేదీ ఖరారైంది. 'మైసా' చిత్రాన్ని 2026 నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రష్మిక చేతిలో ఈటె పట్టుకుని, అత్యంత పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించే ఇంటెన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు గ్లామర్, లవ్, ఫ్యామిలీ, కామెడీ వంటి విభిన్న పాత్రల్లో కనిపించిన రష్మిక.. 'మైసా'లో మాత్రం పూర్తిగా భిన్నమైన అవతార్‌లో కనిపించనుంది. ఇందులో ఆమె గోండ్ గిరిజన మహిళ, తిరుగుబాటుదారిణి పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. పాత్ర కోసం రష్మిక తన లుక్, బాడీ లాంగ్వేజ్‌లోనూ భారీ మార్పులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 'మైసా' కథ గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. అక్కడి ప్రజల జీవన విధానం, వారి నమ్మకాలు, సమస్యలు, పోరాటం వంటి అంశాలను కథలో చూపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా రష్మిక పాత్ర చుట్టూనే కథనం ఎక్కువగా నడుస్తుందని టాక్. ఈ సినిమాలో రష్మిక ఇప్పటివరకు చేయని యాక్షన్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించనుంది. చేతిలో ఈటె పట్టుకుని కనిపిస్తున్న పోస్టర్ చూస్తే.. సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. ఈ సినిమా కోసం రష్మిక అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'మైసా'తో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అనిల్, అజయ్ సయ్యపురెడ్డి, శ్రీకాంత్ సాతి కలిసి అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. కథకు తగ్గట్టుగా భారీ యాక్షన్ సన్నివేశాలు, గిరిజన నేపథ్యాన్ని ప్రతిబింబించే విజువల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే రష్మికకు 2026 చివరి రెండు నెలలు మరింత ప్రత్యేకంగా మారనున్నాయి. ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబలి' చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత కేవలం 42 రోజుల వ్యవధిలోనే 'మైసా' నవంబర్ 27న విడుదల కానుంది.

# 'కల్కి2'పై బిగ్ అప్‌డేట్..!





దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ ది గేమ్'. ఈ చిత్రం సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలో నహాస్ హిదాయత్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కల్కి2'కి సంబంధించిన అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఇప్పుడీ వీడియో వైరల్ అవుతోంది.


'ఇప్పటివరకు పది రోజుల షూటింగ్ చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. ప్రభాస్‌కు సమయం దొరకపోవడంతో లేట్ అవుతుంది. అతనికి సమయం దొరికాక పెద్ద షెడ్యూల్ ప్లాన్ చేస్తాం' అని వెల్లడించారు.

2024లో విడుదలై..

కాగా ప్రభాస్ - నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'కల్కి 2898 ఏడీ'. 2024 జూన్ 27న విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశాపటానీ, దీపికా పదుకొణె కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు 'కల్కి2' కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ తరహాలో 'కల్కి2'కి సంబంధించిన అప్‌డేట్ అభిమానుల్లో ఉత్సాహన్ని నింపుతోంది.

# దుల్కర్ సల్మాన్ 'ఐయామ్ గేమ్'కు లెంగ్తీ రన్ టైం..!

దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ ఐయామ్ గేమ్. నిహాస్ హిధయత్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 20న విడుదల కావాల్సింది. కానీ పలు కారణాల వల్ల సెప్టెంబర్ 3 ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఒకేసారి పలు ప్రధాన భాషల్లో విడుదల కానుంది. ఐయామ్ గేమ్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ 16ం సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ చిత్రానికి రన్ టైం 173 నిమిషాలు (2 గంటల 57 నిమిషాలు). రన్ టైం ఎక్కువ కావడం కారణంగా ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేయాలంటే స్టోరీ, స్క్రీన్ ప్లే చాలా కీలకం. మరి డైరెక్టర్ లెంగ్తీ రన్ టైం సినిమా చూసేలా ప్రేక్షకులను ఎలా కుర్చీలకు కట్టిపడేస్తాడో చూడాలి. ఈ చిత్రంలో కయాదు లోహర్, ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కథిర్, సంయుక్తా విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# 'ఇరుముడి'తో రవితేజ.. 'మారెమ్మ'తో తమ్ముడి కొడుకు

'ఇరుముడి' హిట్ కొట్టిన రవితేజ మంచి జోష్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇతడి ఇంటి నుంచి మరో హీరో రాబోతున్నాడు. రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ ప్రధాన పాత్ర చేసిన 'మారెమ్మ' విడుదలకు సిద్ధమైంది. వచ్చే శుక్రవారం(సెప్టెంబరు 10) ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. గతంలో 'లవ్ యూ ఇడియట్' అనే మూవీలో మాధవ్ హీరోగా పరిచయమయ్యాడు. కానీ ఇదొచ్చిందా లేదా అనే సంగతి జనాలకు పెద్దగా తెలీదు. తర్వాత విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే 'మారెమ్మ' ఒప్పుకొన్నాడు. ఏడాది క్రితం దీని గురించి ప్రకటన వచ్చింది. కొన్నిరోజుల క్రితం మూవీ రిలీజ్ డేట్ ప్రకటించారు. ఇప్పుడు ట్రైలర్ విడుదల చేశారు. మారెమ్మ అనే గ్రామ దేవత, ఈ దేవి కోసం పెంచే ఓ దున్నపోతు. దాన్ని కాపాలా కాసే ఓ కాపరి. ఊరిలో జరిగే కొన్ని అరిష్టాలు. ఇలా ట్రైలర్ సాగింది. తెలంగాణలోని ఓ పల్లె నేపథ్యంగా మూవీ ఉండనుంది. ఇందులో మాధవ్ సరసన దీపా బాలు హీరోయిన్‌గా చేసింది. మంచాల నాగరాజు దర్శకుడు. ఈ సినిమాతోనైనా మాధవ్ హీరోగా సక్సెస్ అందుకుంటాడేమో చూడాలి?

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.